జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 01 పక్షపత్రిక జనవరి 01-15, 2017



## రాజకీయ అవినీతిపై డ్రామాలాడితే డీమానిటైజేషన్ వృధా ప్రయాసే!



# యువ 'నాయకత్వ సత్తా' ఎక్కడ?





# సామాజిక రాజకీయం చేయండి; యూత్ ఫోరంలో జేపీ

రాజకీయాలంటే ఎన్నికలలో పోటీచేయటం మాత్రమేననే భావన నుంచి యువతీయువకులు బైటపడాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. రాజకీయమంటే ప్రజల సమష్టి అవసరాలను గుర్తించి, సామరస్యంగా ఒక నాగరిక పరిష్కారాన్ని రూపొందించి ప్రభుత్వాల చేత అమలు చేయించుకోవటమని అన్నారు. ఎన్నికలు ఇందుకో అవకాశం మాత్రమేనన్నారు. ఉపాధి కల్పన, వారసత్వంగా పదవులు అందుకోవటం కోసం రాజకీయాలలోకి రావాలనుకునే ధోరణుల్ని వీడి, చుట్టూ వున్న ప్రజాసమస్యలను పరిష్కరించే సామాజిక రాజకీయాన్ని యువత రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. విశాఖ రుషికొండ వద్దనున్న గీతం కళాశాలలో యూత్ స్పీక్‌ఫోరం నిర్వహించిన కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. పాఠశాల విద్యాప్రమాణాలు దేశమంతా వృద్ధి చెందిన రోజున రిజర్వేషన్లకు డిమాండ్, వివక్ష క్రమేపి తగ్గిపోతాయని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కార్యక్రమంలో యూత్ స్పీక్ ఫోరం అధ్యక్షుడు అభిషేక్‌తోపాటు పలువురు విద్యార్థులు, యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జనవరి 1-15, 2017

సంపుటి - 8 సంచిక - 01

## లోపలి పేజీల్లో...

యువ నాయకత్వ సత్తా ఎక్కడ.......... 5
స్వచ్ఛందం కరువవుతోంది............... 11
ముందుచూపుతో ఉద్యమించండి...... 13
జవసత్వాలున్న యువ నాయకత్వం..... 16
అవినీతి నిరోధక చట్టంలోని ............. 19
సామాన్య ప్రజలను జైలుకు పంపుతూ.. 20
ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ......... 23
జన్మభూమిలో నిలదీయండి............. 24
సారీ జస్టిస్ చౌదరిగారూ మీ తీర్పు...... 25
కీలకమైన తీర్పు............................ 27
రాజకీయ అవినీతిపై డ్రామాలాడితే...... 31
వెనకబడిన జిల్లాలకు హోదా ఇవ్వాలని.34


### సంపాదక వర్గం


డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



## కార్టూన్ కార్నర్




మీరేం భయపడకండి. ఇదిగో సర్వే రిపోర్టు... అన్ని పంపకాలూ ఉంటాయి...

### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

### చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*


చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# యువ 'నాయకత్వ సత్తా' ఎక్కడ?




అయిదు వేల ఏళ్లకు పైగా అవిచ్ఛిన్న నాగరికత, సంస్కృతి, చరిత్ర కలిగిన భారత్‌లో నాగరిక ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, స్థానిక సాధికారత, హేతుబద్ధ చర్చ, చట్టబద్ధ పాలన వంటి అంశాలను ప్రధాన రాజకీయ ఎజెండాగా మార్చేందుకు లోక్‌సత్తా సుదీర్ఘ పోరాటం చేస్తోంది. ప్రజాచైతన్యమే ప్రజాస్వామ్యానికి అసలైన రక్ష కాబట్టి.. ఆయా సంస్కరణల మీద తరచూ ప్రజలను, ముఖ్యంగా యువతను చైతన్యపరిచేందుకు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలోనే ఆమధ్య గూగుల్ హ్యాంగవుట్ ద్వారా విద్యాసంస్కరణల మీద చర్చించారు (ఆరోగ్యం, వ్యవసాయం, ప్రజల పన్నుల డబ్బు ఎటుపోతోంది? తదితరాంశాల మీద లోక్‌సత్తా గూగుల్ హ్యాంగవుట్‌లను జేపీ సోషల్ మీడియా ఎకౌంట్లలో చూడవచ్చు). ఇందులో వివిధ ప్రాంతాల నుంచి కొందరు ఆలోచనాపరులు కూడా పాల్గన్నారు. 'భారతదేశానికి ఉన్న పరిమిత వనరుల మధ్యే అందరికీ నాణ్యమైన విద్యను అందించే పరిష్కారాల' గురించి సాగుతున్న ఈ చర్చలో ఓ విద్యావేత్త చేసిన వ్యాఖ్య ఒక ప్రశ్నను లేవనెత్తింది.

"అత్యుత్తమ యువత ఏం రంగంలోకి వెళ్లాలి?"..

'అత్యుత్తములు బోధనారంగంలోకి రాకుండా డబ్బు, గ్లామర్ కోసం ఇతర రంగాలను ఎంచుకోవటం వల్ల కూడా మనదేశంలో విద్యా ప్రమాణాలు తగ్గిపోతున్నాయి' అన్నారామె. అయితే, ఈ అభిప్రాయంతో జేపీ ఏకీభవించలేదు.

'అత్యుత్తములు విద్య, వైద్యం, పరిశోధనలు వంటి కీలక రంగాల్లోకి రావాల్సిందే. కానీ దేశాభివృద్ధిని, అత్యధికశాతం ప్రజల జీవితాల్ని అత్యధికంగా ప్రభావితం చేసే రాజకీయాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి' అని జేపీ వ్యాఖ్యానించారు. దీనిమీద చర్చను మరీ ఎక్కువ పొడిగించకపోయినా, చాలా కీలకమైన ఈ సూచనను ఆనాటి గూగుల్ హ్యాంగవుట్ చర్చ అందించింది.

మనదేశంలోని దాదాపు 130 కోట్లమంది జనంలో మెజారిటీగా ఉన్న యువతలో కొద్దిశాతానికే అవకాశాలు లభిస్తున్నాయనుకున్నా.. మెరికల్లాంటి వాళ్లు లక్షలు, కోట్లలో ఉండాలి. కానీ రాజకీయాల్లో సరైన యువ నాయకులేరీ?

'మీకు సిగ్గులేదు' అని కోట్లాది యువత ముఖాన ఊసినట్లు నాయకుల కొడుకులు, కూతుళ్లు, అల్లుళ్లు, ఇతర కుటుంబ సభ్యులే రాజకీయాలలోకి ప్రవేశిస్తున్నారు, ఎదుగుతున్నారు. వీరిలోనూ పనికిమాలినవాళ్లే ఎక్కువ.

'ఆటగాళ్లు మారితే చాలదు, ఆటనియామాలు మారాలి' అనే లోక్‌సత్తా నినాదాన్ని, జేపీ 2009, జూన్‌లో అసెంబ్లీ ముందుంచిన 'అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లు'ను స్ఫూర్తిగా తీసుకుని 'లీడర్' అనే సినిమా చాలామందికి గుర్తుండే ఉంటుంది.. 'ఈదేశాన్ని బాగుచేసే పనిని ఓ యజ్ఞంలా చేయటానికి వందమంది మెరికల్లాంటి యువతీయువకులు కావాలి నాకు' అని హీరో ఆ సినిమాలో అడుగుతాడు. 'కష్టం సార్' అని సహాయకుడు పెదవి విరుస్తాడు. "ఇన్ని కోట్ల మంది యూత్‌లో ఓ వందమంది సమర్థులు లేరా?" అని హీరో ఆశ్చర్యపోతాడు. "సమర్థ యువత ఆదాయాల్ని ఆర్జించుకునే పనిలో ఉంటారుగానీ, దేశాన్ని బాగుచేసే పనిచేయడానికి రారంటూ సహాయకుడు సర్దిచెబుతాడు.

.. ఈవేళ రాజకీయాల్లో సత్తా గల యువ నాయకత్వ శూన్యతను కాస్త బలంగా చెప్పటానికే ఈ సినిమా ప్రస్తావన!



దేశ జనాభాలో రాబోయే కాలంలో 90శాతానికి పైగా సమయాన్ని తమ సొంతం చేసుకునే యువత ఉన్న దేశంలో.. రాజకీయాలకు వారు నాయకత్వం వహించకపోతే, పాలనలో భాగస్వాములు కాకపోతే ఇక ఆ దేశం ఏమి ఎదుగుతుంది? ప్రజాస్వామ్యం ఏం పరిణతి చెందుతుంది?

**ఆనాడు ఒక్కతరంలోనే..**

స్వతంత్ర పోరాటానికి ముందు, పోరాట కాలంలో, స్వతంత్ర వచ్చాక కూడా ప్రపంచంలో మరేదేశానికీ లేనంత పెద్దసంఖ్యలో గొప్ప నాయకత్వం మనదేశానికి సమకూరింది. అనేకులు సంస్కర్తలుగా, నేతలుగా దేశాన్ని సుసంపన్నం చేశారు. గాంధీ, నెహ్రూ, పటేల్, అంబేద్కర్, రాజాజీ, మౌలానా ఆజాద్, సుభాష్ బోస్, సరోజినీ నాయుడు, దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఇలా ఎందరో నేతలు ఒకేతరంలో వచ్చారు. కానీ ఈవేళ అలాంటి యువనాయకులు ఎందుకు రాలేకపోతున్నారు? ఎక్కడుంది సమస్య? ఈ సమస్యను అధిగమించటం ఎలా? ఈ జనవరి 12 – స్వామి వివేకానంద జన్మదినం, జాతీయ యువజన దినోత్సవం ఈ మథనానికి, నిర్మాణాత్మక యువ రాజకీయ, సామాజిక నాయకత్వ పాలసీ రూపొందించుకోవటానికి సందర్భం కావాలి.

**మహాత్మాగాంధీ అయినా ఓడిపోయే ఎన్నికల వ్యవస్థను తయారుచేసుకున్నాం**

జాతీయోద్యమ కాలం నాయకుల్లో ఎక్కువమంది రాజకీయాల్ని పవిత్ర వ్యాసంగంగా భావించి బాధ్యతలు తీసుకోవటం వల్లే దేశానికి గొప్ప సారథ్యం సమకూరింది. కానీ కాలక్రమంలో ఎప్పుడైతే 'ఎన్నికలలో గెలవటానికి మంచివారు, సమర్థులు పనికిరారు.. గెలిచినవారు మంచిగా, సమర్థవంతంగా పాలించలేరు' అనే వ్యవస్థను నిర్మించుకున్నామో.. నాయకత్వ కొరత మొదలైంది. డబ్బు, మద్యం పంచకుండా, తాత్కాలిక తాయిలాల్ని ప్రకటించకుండా, ప్రజల మధ్య విద్వేషాల్ని పెంచకుండా మహాత్మాగాంధీ కూడా ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థలో గెలవలేరని అనేక రుజువుల్ని చూపిస్తున్నాం. అంతెందుకు, తాను ఎన్నికలలో పోటీచేస్తే డిపాజిట్ కూడా రాదని అన్నా హజారే లాంటి వ్యక్తి బహిరంగంగానే వ్యాఖ్యానించారు. యువత రాజకీయాలను ఓ జుగుప్సాకర వ్యవహారంగా, జోక్‌గా, కాలం వృథా చేసే కార్యక్రమంగా భావించటం మొదలుపెట్టారు. రాజకీయాలలో గెలవాలని ఉత్సాహం, పట్టుదల ఉన్నవారిని కూడా డబ్బు, కాలం వృథా అనే భావన వారిని వెనక్కినెడుతోంది. డబ్బు ప్రభావం తక్కువగా ఉన్న కొన్నిచోట్ల అక్కడక్కడా కొంతమంది చదువుకున్న యువత గెలుస్తున్నా వ్యవస్థల్ని మార్చలేక పరిమితమైపోతున్నారు. ఓడిపోయాక రాజకీయాలను వీడి మళ్లీ వ్యక్తిగత ప్రయోజనకర కెరీర్‌లనే వెతుక్కుంటున్నారు. ఏపనీలేక, అయినకాడికి దండుకుందామనుకున్నవారే రాజకీయాలలోకి వస్తున్నారు. వాళ్లు కూడా జెండాలు మోసే ఉపాధి హామీ కూలీలుగానే తప్ప పెద్దస్థాయిల్లోకి ఎదిగిన దాఖలాలు తక్కువే. డబ్బు, వంశపారంపర్య రాజకీయాలు వారికి పెద్దఅవరోధంగా మారిపోయాయి. దేశవ్యాప్తంగా కొన్నేళ్లుగా విస్తరిస్తూ వస్తున్న విషవలయ స్థూల దృశ్యమిది.

**ముందుచూపులో జాతీయోద్యమ నేతలూ విఫలమయ్యారు**

ఈరకంగా.. యువత నిజాయతీగా, నిబద్ధతతో స్పందించేందుకు, తమ భావాల్ని బలంగా వ్యక్తం చేసేందుకు తగిన వ్యవస్థల్ని మనం నిర్మించుకోలేకపోవటం ఈవేళ భారతదేశం ఎదుర్కొంటున్న పెద్ద వ్యవస్థీకృత సవాలుగా మారింది. తాము కలలుగన్న భవిష్యత్ భారతానికి కావలసిన వ్యవస్థీకృత ఏర్పాట్లను ఊహించటంలో, ఏర్పరచటంలో మన జాతీయోద్యమనేతలు విఫలమవటమే ఇందుకు ప్రధాన కారణమని కూడా మనం అంగీకరించాలి.

మనదేశ పరిస్థితులకు తగ్గ పాలనారాజకీయ వ్యవస్థల్ని నిర్మించి అందులో ప్రజలను భాగస్వాముల్ని చేయకుండా, భావోద్వేగ సంచలనాల మధ్య కేవలం బ్రిటీషు వ్యవస్థని అనుకరిస్తూ స్వతంత్రం తెచ్చుకోవటం వల్ల ఎన్ని అనర్థాలు జరిగాయో కాలక్రమంలో పలు పరిణామాలు రుజువు చేస్తున్నాయి. జాతీయోద్యమ పెద్దలు ఊహించని ఎన్నో

వైఫల్యాలు మన స్వదేశీ పాలకుల వల్ల దేశానికి దాపురించాయి. తొలితరం నేతలు తప్పుకోగానే వైఫల్యాల తీవ్రత దేశాన్ని భ్రష్టుపట్టించింది. కొంత ప్రశంసనీయ అభివృద్ధి జరిగినా జాతినిర్మాణం చేసే స్థాయిలో వ్యవస్థల నిర్మాణం, అభివృద్ధి జరగలేదు.




నిజానికి మన స్వతంత్ర సమర యోధుల ఘనత ప్రధానంగా జాతి నిర్మాణం! యావత్ భారతదేశాన్నీ ఒక తాటి మీదకు తేగలిగారు వారు. భారతీయతను వేళ్లానుకునేలా చేశారు. కానీ దాన్ని కొనసాగించి భారత్‌ని ఒక సూపర్ పవర్‌గా చేసే, వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాన్ని కల్పించే రాజకీయాన్ని, వ్యవస్థల నిర్మాణాన్ని, ఆర్థిక వ్యవస్థని వారు విస్మరించారు. అదే ఈవేళ భారత్‌ను సంధి దశలోకి నెట్టింది. అన్ని అవకాశాలూ ఉన్నా వైఫల్యాలు వెక్కిరిస్తున్నాయి. సరైన ఆలోచన లేని నాయకుల్ని ఎన్నుకుంటూ వాళ్లు తీసుకునే అధ్వాన్నపు నిర్ణయాల పర్యవసానాల్ని నిస్సహాయంగా అనుభవిస్తున్నాం.

### అధికార కేంద్రీకరణ పెద్ద అనర్థదాయకమైంది

స్వాతంత్ర్యం వచ్చేనాడు దేశంలో ఉన్న విభజన పరిస్థితులకు, గ్రామాల్లో కుల, పెత్తందారీ ఆధిపత్యాలకు భయపడి అధికారాన్నంతటినీ కేంద్రీకరించటంతో.. అవినీతి పెరగటం, ప్రజలలో పౌరసత్వ భావన రూపుదిద్దుకోకపోవటం, ప్రజాప్రతినిధులు ఎంత కష్టపడినా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందకుండా ప్రభుత్వాధికారులు నల్లదొరల్లా వ్యవహరిస్తుండటంతో, ప్రజలకు రాజకీయాలపట్ల జుగుప్సపెరిగి ఓటుకు నోటు, మద్యం, డబ్బు ప్రభావం పెరిగాయి. ఇవీ చాలక కులం, మతం, ప్రాంతం, భాష వంటి వాటి పేరుతో చిచ్చుపెట్టటం మొదలైంది. నల్లడబ్బు ఖర్చుపెట్టినా గెలవకపోవచ్చు, కానీ ఖర్చు పెట్టకపోతే ఓటమి మాత్రం ఖాయం అనే పరిస్థితిలో ఉత్తములు రాజకీయాలకునుంచి వైదొలగటం మొదలైంది. 2014 ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాలలోనే సాంప్రదాయ పార్టీలు సుమారు రూ.8,000కోట్లు ఖర్చు పెట్టినట్టు అంచనా. ఐదేళ్ల కాలవ్యవధిలో దేశవ్యాప్తంగా అన్ని ఎన్నికలకూ కలిపి తక్కువలో తక్కువగా రూ.1లక్ష కోట్లు ఓట్ల కొనుగోలుకు ఖర్చు చేస్తున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బు ఖర్చు పెట్టినవారు గెలిచాక అంతకంత దండుకోవటం చేస్తున్నారు. ఈ పరిస్థితిని ఆనాటి జాతీయోద్యమ నేతలు ఊహించలేదు. అలాగే పేదరికం పోవటానికి అందరికీ మంచి విద్యను అందిస్తారని రాజ్యాంగ నిర్మాతలు ఆశిస్తే, అందుకు విరుద్ధంగా పాలకులు వ్యవహరించి రిజర్వేషన్లకే పరిమితమై, అసమానతల్ని కొనసాగిస్తున్నారు. ఈ పరిస్థితుల మధ్య ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే, తక్కువ వచ్చినా ఓడినట్టే అనే ఎన్నికల వ్యవస్థలో, ఎంత గొప్ప సంస్కరణవాది అయినా రాజకీయాలను పట్టించుకునే సాహసాన్ని అంత త్వరగా చేయలేరు.

ఈ ప్రతికూల పరిస్థితిని మారిస్తేనే మనం నాటి తరంలోలాగా యువ రాజకీయ రోల్‌మోడల్స్‌ని చెప్పుకోదగిన సంఖ్యలో చూడగలం.

### పార్టీలకతీతంగా పరోక్ష రాజకీయ నాయకత్వాన్నయినా అందించవచ్చు

రాజకీయం అంటే ఓ పార్టీలో చేరి, ఎన్నికలలో గెలవటమే కాదు. ఈ తరహా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అందరూ రానక్కర్లేదు. పరోక్ష రాజకీయమూ చేయవచ్చు. స్థానికంగా తన చుట్టూ ఉన్న ప్రజల సమస్యల మీద పనిచేస్తూ సామాజిక సమస్యల మీద పోరాడుతూ మార్పుల్ని తీసుకురావటం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు సక్రమంగా జరిగేలా చూడటం, ప్రజలు తమ ఓటు హక్కును, భావప్రకటనా స్వేచ్ఛను సక్రమంగా వినియోగించుకునేలా చేయటం, సంఘాలుగా ఏర్పడి తమ కార్యకలాపాలు స్వేచ్ఛగా చేసుకునేలా చేయటం ఇలాంటివన్నీ యువత చేయవచ్చు. ఇలా చూస్తే ప్రజాభ్యుదయం కోసం ఎన్నో రంగాలలో వివిధ స్థాయిలలో కృషి చేసిన చెప్పుకోదగిన నాయకులు ఈవేళ కూడా కనిపిస్తారు. జేపీకి హీరోలుగా ఉన్న డా॥ రజనీకాంత్ అరోలీ, డా॥ కురియన్ వంటి వారెవరూ ప్రత్యక్ష రాజకీయాలలో లేరు. రైతు నేత శరద్ జోషి కొంతకాలం పార్టీ రాజకీయాల్లో ఉన్నారు. కానీ వీరు పార్టీలకతీతంగా




పార్టీల్ని, విధానాల్ని, ప్రజాజీవితాన్ని అద్భుతంగా ప్రభావితం చేశారు. భావితరాలకు గొప్ప మార్గాన్ని తమ పరిధిలో అందించారు. ఇలాంటి వాళ్లు ఇంకా వస్తున్నారు. మన చుట్టూ వున్న సర్పంచ్‌ల దగ్గర్నుంచి అంతరిక్ష కలాపాలు చేసే 'ఇస్రో' వరకూ పలురంగాల్లో కనిపిస్తారు. ఈ స్ఫూర్తిని ఒడిసిపట్టి యువత తమ వంతు నాయకత్వం అందించటానికి సంకల్పం తీసుకోవాలి.

### జాతీయోద్యమ నేతల్లా సర్వస్వం త్యాగం చేయనక్కర్లేదు

యువత మళ్లీ నాయకులుగా ఎదగాలంటే.. మారుతున్న ప్రపంచానికి తగ్గట్టు ప్రోత్సాహకాల్ని కూడా మార్చాలి. మంచిమార్గంలో కష్టాలు తప్పవు, చెడుమార్గంలో గ్యారంటీగా లాభాలుంటాయి అనే ధోరణిని మనం సమాజంలోకి ఎక్కించాం. దీంతో, రాజకీయాలకి అతీతంగా సామాజిక సంస్కరణలకి, జాతి నిర్మాణానికి నడుం కట్టేవాళ్ళు కరువయ్యారు. మనకు పదవుల్లో ఉన్నవారు తప్ప నాయకులుగా కనిపించరు. ఈ ధోరణిని మార్చేందుకు ప్రయత్నపూర్వక కృషి ప్రారంభించాలి.

అలాగే నాయకత్వం కోసం యువత స్వతంత్ర పోరాటకాలంలోలాగా సర్వస్వం త్యాగం చేయాల్సిన పనిలేదు. అలా కోరటం సమంజసం కూడా కాదు. నిజానికి గాంధీ అనుకోకుండా ఈ విషయంలో దేశానికి పొరపాటు సంకేతం ఇచ్చారేమో అనిపిస్తుంది. నాయకత్వమంటే గాంధీలా జీవించటమే అంటే అది ఆచరణసాధ్యం కాదు. 21వ శతాబ్దంలో సమాజం, ఆర్థికవ్యవస్థ, సాంకేతిక విజ్ఞానం శరవేగంగా నడుస్తున్నాయి. ఈకాలంలో గతంలోలాగా వేలాదిమంది తమ వ్యక్తిగత జీవితాలని, కుటుంబ ప్రయోజనాలని త్యాగం చేసి సమాజం కోసం పోరాడటం తేలిక కాదు. తమ జీవితాన్ని నిజాయతీగా, గౌరవంగా నడుపుకుంటూ, సమాజహితం కోసం దీర్ఘకాలం పోరాటం చేసే పటిమ, చిత్తశుద్ధి గల నాయకత్వం నేటి అవసరం. స్వతంత్ర పోరాట కాలానికి, ఇప్పటికీ పరిస్థితులలో కొన్ని గణనీయమైన మార్పుల్ని కూడా మనం ఈ సందర్భంగా గుర్తించాలి.

స్వతంత్ర పోరాటకాలంలో ఎందరో మహనీయులు తమ సమయాన్ని, శక్తిని, వనరుల్ని స్వచ్ఛందంగా దేశసేవ కోసం అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమం పట్ల ఉత్తేజపూరిత ఆకర్షణీయ భావన, ఆరాధనాభావంతో కూడిన దేశభక్తి, ఎదుగూబొదుగూలేని వ్యవసాయార్థిక వ్యవస్థలో చెప్పుకోదగిన కెరీర్ అవకాశాలు లేకపోవటం వల్ల అటువంటి త్యాగం ఆరోజుల్లో మోయలేని బరువుగా, పెద్దబాధగా అనిపించలేదు. కానీ, ఒక స్వతంత్ర రిపబ్లిక్‌లో ఏరోజుకారోజు అన్నట్టుండే పోటీసేవల ప్రపంచంలో అదేతరహా త్యాగాన్ని ఆశించటం అవాస్తవికమవుతుంది. వేగంగా పెరుగుతున్న ఆర్థికవ్యవస్థలో కుటుంబాలని పేదరికంలోకి నెట్టే త్యాగాలు అందరికీ సాధ్యం కావు. జాతి సంపద పెరుగుతున్న దశలో కెరీర్‌ని వదులుకోవటం ద్వారా జారవిడుచుకుంటున్న అవకాశానికి భారీ మూల్యమే చెల్లించాలి. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని మనం సమాజంలో ఎక్కడికక్కడ ప్రజలు తమ వ్యక్తిగత సుఖాన్ని, కుటుంబ అవసరాల్ని చూసుకుంటూ సమాజహితంలో భాగమయ్యే వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయాలి.

### కెరీర్ చూసుకుంటూ స్థానికంగా వ్యవస్థల నిర్మాణం మొదలుపెట్టండి

అందుకే ప్రతి యువతి, యువకుడు సొంత జీవితం చూసుకుంటూనే.. ముందు స్థానికంగా పార్టీపరంగానో, పార్టీలకతీతంగానో పనిచేయటం ప్రారంభించాలి. హేతుబద్ధత, సృజనాత్మకత, పరిష్కారం.. ఆ పనికి గీటురాళ్లు కావాలి. బట్టీబట్టిన చదువులతో ఈ లక్షణాలు అలవడవు. వీటిని

పెంచుకునేలా చదువుకోవాలి. అలాగే, వ్యక్తిగతంగా నిజాయతీని గొప్ప ప్రజాజీవిత అర్హతగా భావించవద్దు. వ్యక్తిగత నిజాయతీ కనీస లక్షణంగా ఉండాలి. మీరు ప్రదర్శించాల్సింది వ్యవస్థీకృత నిజాయతీని! నిజానికి భావసారూప్యమున్న రాజకీయ పార్టీలకు, లోక్‌సత్తా రాజకీయ ఉద్యమానికి ఉన్న తేడా ఇక్కడే ఉంటుంది. ఆ పార్టీలు వ్యక్తిగత నిజాయతీనే గొప్ప ప్రజాసేవగా భ్రమింపచేస్తుంటాయి. కానీ లోక్‌సత్తా వ్యవస్థీకృత నిజాయతీని ప్రజాసేవకు గీటురాయిగా భావిస్తుంది.

### యువతవేగంగాభాగస్వాములవ్వటానికికొన్నిఆయుధాల్నిఅందించాలి

స్పందించటానికి, కార్యాచరణ చూపటానికి సరైన వ్యవస్థలు, ఆయుధాలు ఉంటే ప్రజల నుంచి నాయకత్వం దానంతటదే వస్తుందని 2005లో వచ్చిన సమాచార హక్కు చట్టం అనుభవం పరిమితంగానైనా రుజువు చేస్తోంది. అందుకే.. యువత ఎక్కడికక్కడ రాజకీయ, సామాజిక మార్పుల్లో వేగంగా భాగస్వాములవ్వాలంటే.. అధికార వికేంద్రీకరణ జరిగి స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించటం, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ పనైనా ఖచ్చిత కాలపరిమితిలో పూర్తికాకపోతే పరిహారం చెల్లించేలా సర్వీస్ గ్యారంటీ చట్టం తేవటం,అవినీతి అంతానికి బలమైన వ్యవస్థల్ని అన్ని స్థాయిల్లో ఏర్పాటు చేయటం, ఎన్నికలలో డబ్బు, తాయిలాలు, విద్వేషాల ప్రభావాన్ని తగ్గించటానికి ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థ స్థానంలో దామాషా ఎన్నికల వ్యవస్థను తేవటం, అందరికీ మంచి ప్రమాణాల చదువు, ఆరోగ్యాన్ని అందించటం వంటి సంస్థాగత ఏర్పాట్లు చేయాలి. వీటిలో కొన్ని డీమానిటైజేషన్ నేపథ్యంలో నల్లధనం, పన్నుల సంస్కరణలకు కూడా ప్రధాన పరిష్కారాలవుతాయి.

ఇలా మనం వ్యవస్థల్ని ప్రక్షాళన చేసుకుని అధికారంలో ప్రజల భాగస్వామ్యానికి అవకాశాల్ని పెంచుతుంటే పౌరసత్వ భావన పెరిగి అన్ని స్థాయిలో నీతివంతమైన యువ నాయకత్వం వస్తుంది. ఆచరణసాధ్యంగా ఉండే ఆ మార్పువల్ల ఎక్కడికక్కడ లిటిల్ రిపబ్లిక్కులు తయారై గొప్ప ప్రజాస్వామిక వ్యవస్థ రూపుదిద్దుకుంటుంది. నక్సలిజం అవసరం కూడా పోతుంది. అందుకే తమ స్థానిక నాయకత్వ కార్యాచరణలో భాగంగా అమ్మాయిలు అబ్బాయిలు ఈ ఎజెండా కోసం కూడా పోరాడాలి.

### ఎవరూ పనిచెయ్యనివ్వటం లేదు.. వంటి కుంటిసాకులొద్దు

మమ్మల్ని ఎవరూ పనిచెయ్యనివ్వటం లేదు, నేనొక్కడినే, ఒక్కదాన్నే ఏంచేయగలను?, పూర్వకాలం రోజులే హాయి లాంటి పనికిమాలిన, కుంటిసాకులతో మోసం చేసుకోకుండా.. యువత స్థానికంగా ఉమ్మడి అవసరాలను తీర్చే అర్థవంతమైన పనులను మొదలుపెట్టాలి. రొమాంటిసిజం, డాంబికాలు లేకుండా ధైర్యంగా, హేతుబద్ధ వాదనలతో ఓపిగ్గా ఇతరులను ఒప్పించేలా వ్యవహరించాలి. మరీ ఎక్కువ పనుల జోలికిపోవద్దు. దశలవారీగా.. కానీ క్రమం తప్పకుండా చేయండి. ప్రతిరోజునో, వారంలో రెండురోజులో చేయండి. కానీ ప్రతి నిముషాన్నీ సద్వినియోగం చేయండి. క్వాలిటీ టైం వెచ్చించటం అవసరం.

### సోషల్ మీడియాలో థాట్ లీడర్స్‌లా చెలరేగండి

డిజిటలైజేషన్ పెరగటం యువతకు పెద్ద వరం. భారత్ వంటి సంక్లిష్ట భిన్నత్వమున్న దేశంలో సంస్కరణలు చైనాలో కంటే కూడా కష్టసాధ్యమని సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ వంటి వారు కూడా వ్యాఖ్యానించినా, లోక్‌సత్తా ఆ బృహత్ కార్యానికి సాహసం చేయడం వెనక ప్రధాన చోదకశక్తులు – యువత, సాంకేతికతే! అన్నీ ఆన్‌లైన్ అవుతుండటం కొత్త రాజకీయాన్ని, వ్యవస్థని కోరుకుంటున్న అసంఖ్యాక సామాన్య యువతకు గొప్ప అవకాశంగా మారుతుంది. ఉన్నకొద్దీ ఈ అవకాశం పటిష్టమవుతుంటుంది. రాజకీయ, సామాజిక రంగాల్లో తమ కార్యక్రమాలకు సాంకేతికతను యువత పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలి. సోషల్ మీడియాలో రకరకాల వేదికల ద్వారా సాటివారిని అనుసంధానం చేసుకుంటూ చకచకా భావాల్ని పంచాలి. కుల వివక్షను, వంశపారంపర్య రాజకీయాలనూ ఛేదించాలి. అయితే దుందుడుకు, చౌకబారు వ్యాఖ్యలు చేయటం హీరోయిజం కాదు, జీరోయిజం అని గుర్తుపెట్టుకోవాలి. ఇంతకుముందే అనుకున్నట్టు.. హేతుబద్ధంగా, సృజనాత్మకంగా, అదే సమయంలో ధైర్యంగా ఇతరులను ఒప్పించాలి. ప్రజాస్వామిక భావాలున్నాయనుకునేవారు, ఉమ్మడి ప్రయోజనాల కోసం పనిచేసి నెగ్గాలనుకునేవాళ్లు కచ్చితంగా హేతుబద్ధత, హుందాతనం, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేయటమనే బహిరంగ చర్చా ప్రమాణాలను పాటించాలి. ఇవి పాటించకుండా తాత్కాలికంగా నెగ్గినా.. దీర్ఘకాలంలో ఎవరూ పట్టించుకోరు. థాట్ లీడర్స్‌లా వ్యవహరించకపోతే ఆముదం చెట్లు కూడా మహావృక్షాల్లా భ్రమింపచేస్తుంటాయి. డిజిటల్ ప్రపంచంలో కంటెంటే కింగ్ కాబట్టి.. ఈ విషయంలో యువతకు లోక్‌సత్తా అజరామర భావజాలం ఎంతో ఉపయోగపడుతుంది. తిరుగులేని కంటెంట్ బలం, దూరదృష్టి, స్వయందిద్దుబాటు, కాలానుగుణంగా మార్పులకు తగ్గట్టు మారగలిగే ప్రమాణాలు,

ఉదార ప్రజాస్వామిక విలువలు కలిగివున్నందున లోక్‌సత్తా భావజాలురకు డిజిటలైజేషన్ అనేది అతి పెద్ద అవకాశం అవుతుంది.




**సమాజం కూడా నిజాయతీ డబ్బు విరాళాల్ని, గుర్తింపుని ఇవ్వాలి**

ఇలా మెరుగైన వ్యవస్థ నిర్మాణం కోసం పోరాడే యువత నిర్వహించే సంస్థలకి సమాజం కూడా 'నిజాయతీ డబ్బు' ఊతాన్నివ్వాలి. పలు దేశాలలో పౌరసమాజ సంస్థలకి విరాళాలిచ్చే దాతలకి నూటికి నూరుశాతం పన్ను రాయితీలున్నాయి. దీంతో ప్రతి పనికీ ప్రభుత్వం మీద ఆధారపడకుండా ప్రజలు తమంత తామే ఉమ్మడిగా సంస్థాగత కృషిని దీర్ఘకాలం చేపట్టటం సాధ్యమవుతున్నది. ఎన్నో వైరుధ్యాలు, ఎంతో వైవిధ్యం ఉన్న మన సమాజంలో జాతి నిర్మాణం కోసం, దీర్ఘకాలిక లక్ష్యాల కోసం, సంకుచితత్వానికి అతీతంగా పోరాడేందుకు యువత భాగస్వామ్యముండే సంస్థలకి ఇలాంటి పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు అవసరం. మంచి రాజకీయం, సమాజం కోసం పూర్తిస్థాయి సమయమిచ్చి త్యాగం చేస్తున్నవారికి తగిన గుర్తింపును కూడా ఇవ్వాలి. గాంధీ, అంబేద్కర్‌లాంటి స్థాయిలో జీవితాల్ని దేశం కోసం సమర్పించేవారికి మనమిచ్చే గుర్తింపు వల్ల ఒరిగేదేమీ లేకపోయినా, దాని వల్ల సమాజంలో స్ఫూర్తి పెరుగుతుంది, సమాజం తన బాధ్యతను కూడా నెరవేరుస్తున్నట్టవుతుంది.

**ఒకస్థాయికి వచ్చాక ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావొచ్చు, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగొచ్చు**

ఒకస్థాయికి వచ్చి మీ కాళ్ల మీద మీరు నిలబడ్డాక.. అసాధారణ సామర్థ్యం, ఆసక్తి ఉన్నవారు పూర్తిస్థాయి ప్రత్యక్ష రాజకీయాలలోకి ప్రవేశించి.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో నచ్చిన పార్టీ ద్వారా ఎన్నికలలో పోటీ చేయవచ్చు. సొంత వనరుల్ని అందించడం లేదా వనరుల్ని సమకూర్చుకోవడం – రెంటిలో ఏదో ఒకటి ఉండాలి, రెండూ ఉంటే మంచిది. ఇలా నాయకత్వ బాధ్యతల్ని నచ్చినంత కాలం నిర్వహించవచ్చు.

**ఇది కాలం వృథా కాదు .. ప్రతి ఒక్కరి బాధ్యత, ఆడుతూ పాడుతూ చేయండి**

సామాజిక, రాజకీయ కార్యక్రమాలలో పాల్గనటం వల్ల కాలం వృథా అనే భావనను చుట్టూ అనేకమంది వ్యక్తం చేస్తుంటారు. కొంతకాలం నిజాయతీగా సేవలు అందించాక యువతలో కూడా కొంతమందికి కాలం వృథా చేసుకున్నామని, గొప్ప త్యాగం చేస్తున్నామనే భావన కలుగుతుంటుంది. ఇది తప్పుడు వాదన. మన విద్యలో, సమాజంలో సోషలీకరణ తగ్గిపోతుండటం వల్ల ఈ వాదన బలపడుతోంది. అంతా ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కలెక్టరు చూసుకుంటారను కుంటే, అధికారం ఉంటేనే పనిచేస్తామంటే దేశం ఉండదిక. కాబట్టి దేశ రాజకీయాన్ని, సమాజాన్ని పట్టించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత కూడా. మనదేశం విషయంలో దేశ జనాభాలో అత్యధికులుగా ఉన్న యువతది ప్రధాన బాధ్యత. ఏ ఒక్కరికీ ఇందులో మినహాయింపు ఉండదు. అయితే, 'త్యాగాలకు సిద్ధంగా ఉన్నారా?' అని స్వతంత్ర పోరాటకాలంలో గాంధీ అడిగినట్టు, ఈవేళ అందరినీ మనం అడగనక్కర్లేదు. ప్రతి ఒక్కరూ పెద్ద త్యాగాలు చేయాల్సిన అవసరం లేకుండా, ప్రత్యక్ష రాజకీయాలలో పూర్తి సమయం వెచ్చించాల్సిన అవసరం లేకుండా ఎలా రాజకీయ, సామాజిక కార్యక్రమాలతో మేలిమి మార్పుల్ని యువత సాధించాలో స్పష్టంగానే చెప్పుకున్నాం. సంకల్పం, రోజువారీ పని సంస్కృతి ఉంటే ఆడుతూ పాడుతూ ఇవన్నీ చేయొచ్చు.

అమృత బీజాలు నాటితేనే అమృత ఫలాలు వస్తాయి.

జీవితంలో ఎదగాలనుకునే,

సుఖసంతోషాలు, సంతృప్తితో జీవించాలనుకునే,

2050 నాటికి మునలితరంగా మారిపోయి పశ్చాత్తాపపడకూడదనుకునే,

చరిత్రకు సరైన వైపున నిలవాలనుకునే అమ్మాయిలూ అబ్బాయిలూ!

మేలుకోండి.. మీ సుఖాన్ని – సమాజహితాన్ని అనుసంధానం చేసే ఈరకమైన యూత్ రాజకీయ, సామాజిక నాయకత్వ పాలసీని రోజువారీ జీవితంలో భాగం చేసుకోండి... తర్వాతి తరానికి మరింత మెరుగైన జీవితాన్ని అందించండి.

ఆల్ ద బెస్ట్!

# స్వచ్ఛందం కరవవుతోంది

- మహేష్ విజాపృకార్


www.shutterstock.com · 17630536

జ్ఞాపకశక్తి కాస్త అధికంగా ఉన్నవాళ్లు, స్వాతంత్ర్యోద్యమంలో నాయకులకుమల్లే స్వచ్ఛంద సేవకులు– వలంటీర్లు కూడా అగ్రభాగాన ఉండటాన్ని గుర్తుతెచ్చుకుంటారు. తర్వాత వీరే స్వాతంత్ర్య సమరయోధులుగా అందరికీ పరిచితులయ్యారు. పోరాడు అనే పదం పోరాటాన్ని నొక్కి చెబుతుంది తప్ప హింసను కాదు. ఎందుకంటే పోరాటం అనేది అహింసాత్మకమైనది. చాలావరకు ఇలాంటి వ్యక్తులు కాంగ్రెస్‌తోనే ముడిపడి ఉండేవారు.

ఒక లక్ష్యం కోసం పార్టీలతో చేతులు కలిపే ఇలాంటి వలంటీర్లను కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీల నేతలు నేడు కార్యకర్తలు అని పిలుస్తున్నారు. గతంలో స్వచ్ఛంద వాదం మూలాలు ఒక లక్ష్యం పట్ల, దాని నేతల పట్ల విశ్వాసం, నిబద్ధత, గౌరవంతో కూడి ఉండేవి. కానీ సమకాలీన ప్రజాజీవితంలో ఒక వర్కర్‌ని, కార్యకర్తని నిర్వచించటం కష్టం. వాస్తవానికి వారు ఎవరు?

వీరు దాదాపుగా రాజకీయ పార్టీల సభ్యులు కారు. ఏ రాజకీయ పార్టీ వద్ద కూడా నేడు నిజమైన సభ్యుల జాబితా ఉండదు. కాంగ్రెస్ పార్టీ మాదిరే ఇతర పార్టీల సభ్యుల జాబితాలు కూడా బోగస్‌వే. అలాగే పార్టీ సభ్యత్వ రుసుము రసీదులు కూడా నకిలీవే. భారతీయ జనతా పార్టీ అయితే తాను సూచించిన ఒక మొబైల్ నంబర్‌కి మిస్డ్ కాల్ చేసే ఎవరయినా సరే తన సభ్యులుగానే గుర్తిస్తోంది. సీపీఎం కార్యకర్తలు ఆ పార్టీ సభ్యులు. శివసేన విషయానికొస్తే పార్టీ పట్ల నమ్మకముండేవారంతా దాని సభ్యులే.

సీపీఎం, శివసేన క్యాడర్‌గా ఉండేవారు గట్టి నమ్మకస్తులు. పార్టీ లక్ష్యం కోసం వీరు తమ ప్రయోజనాలని కూడా పక్కనపెట్టి కృషి చేస్తారు. శివసేన లేదా మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన కండబలాన్ని ఉపయోగించాలని పిలుపునిస్తే సభ్యులు తప్పకుండా పాటిస్తారు. ఒకసారి వారు తమ కండబలాన్ని ప్రదర్శించినట్టయితే, స్థానికంగా వారిని ఎంతగానో గౌరవిస్తారు. పార్టీ దొంతర్లలో పైకి తీసుకొస్తారు.

వలంటీర్లు అంటే డబ్బులు పుచ్చుకోకుండా ఒక లక్ష్యం కోసం నిలిచే సహాయకులు. అదే లక్ష్యం కోసం ముందుకొచ్చే ఇతరులకు టీ అందించే పనికి కూడా వీరు ముందుకొస్తారు. కానీ వర్ధమాన రాజకీయ ప్రపంచంలో ఈ పదం దాని నిజమైన అర్థంలో ప్రతిధ్వనించటం లేదు. ఎందుకంటే ఇప్పుడు ఒక లక్ష్యం లేదా కార్యక్రమానికి హాజరవుతున్నవారు డబ్బులు పుచ్చుకోకుండా ఉండటం లేదు. వీరు ఇప్పుడు తొలుత పనిచేసేవారుగాను, తర్వాత డబ్బులు పుచ్చుకునేవారుగాను ఉన్నారు.

అందుకే ఇలా సభల్లో, పార్టీ కార్యక్రమాలకు జనాలను తీసుకొచ్చేవారిని కార్యకర్తలుగా వర్ణిస్తూనే, అవసరమైనప్పుడు వారికి డబ్బు చెల్లిస్తుంటారు. తక్కిన సమయాల్లో నాయకులుగా వెలిగిపోతుంటారు. కార్యకర్తలు మాత్రం పరాయివారుగా కనిపిస్తుంటారు.

రెండు దశాబ్దాల క్రితం, ముంబయి నుంచి లోక్‌సభకు ఎన్నికయిన ఒక అభ్యర్థిని.. ఆయనకు మద్దతుగా ఊరేగింపు చేసేవారు అంత చింపిరిజుత్తుతో, సాదాసీదాగా ఎందుకు కనిపిస్తున్నారని అడిగాను. గుడిసెవాసులైనవారు రోజు కూలీ కింద తన కార్యక్రమాలకు వస్తుంటారని, అందుకే వారు నిరాడంబరంగా కనిపిస్తారని ఆయన చెప్పారు. ఇలా శివార్లలో ఉండే మేస్త్రీలు, చేతివృత్తులవారు తదితరులు తమకు రోజుకూలీ ఇచ్చే యజమానులకు ఎదురుచూస్తూ కనిపిస్తారట.

పొడవాటి రహదారులమీదుగా నినాదాలు చేస్తూ, మండుటెండలో సుదీర్ఘకాలం పాటు నడిచివచ్చే కార్యకర్తలను కనుగొనటం ఇవాళ చాలా కష్టమని ఆయన వివరించారు. ఒక ప్రదర్శనను నిర్వహించాలంటే రోజుకూలీలను తెచ్చుకోవటం చాలా సులువని ఆయన అభిప్రాయం. వారిని ప్రదర్శన కోసమే తీసుకొస్తున్నప్పుడు వాళ్లెవరు అనేది పెద్ద విషయం కాదు మరి. ఇక్కడ నిజానిజాలు ఏమంత పట్టించుకోదగినవి కావు. అది పదిమందికి కనిపించే ప్రదర్శన మాత్రమే. ఇక ట్రక్కులలో ప్రజలను భారీగా తరలించుకుని వచ్చేవారిని ప్రజానేతలని మనం కూడా భావిస్తుంటాము.

భోజనం పెడతామని, డబ్బులు చెల్లిస్తామని చెప్పి ఒక ఊరేగింపునకు తమను తీసుకువచ్చేవారు ఆ ఊరేగింపు ముగిసిన తర్వాత తమను గాలికి వదిలేస్తారని ఆరోపణలు చేసేవారిని మనం ఎంతమందిని చూడలేదు మరి. ఊరేగింపును ఉద్దేశించి ప్రసంగించే నేత తన ఎదురుగా సభ కిక్కిరిసి ఉండటాన్ని చూస్తాడు. ఇక మీడియా దాన్ని భారీ బహిరంగసభగా వర్ణిస్తుంటుంది. ఇది ప్రజారాసులను కూడగట్టటం ద్వారా ప్రజలను నమ్మించే స్వభావానికి ఒక వ్యక్తీకరణ. అయితే శరద్‌జోషి షేత్కార్ సంఘటన్ ఇలాంటిది కాదు. వీరు నిర్వహించే సభలకు రైతులు తమ సొంత ఖర్చులతో వస్తుంటారు.

ఇక రెండో అంశం ఉంది. ఈమధ్యే ఒక ఎన్జీవోపై విచారణకు సంబంధించిన వార్త మీడియాలో వచ్చింది. హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బిల్లుకు వ్యతిరేకంగా ధర్నా చేయడానికిగాను తాము రోజుకు ఒక్కొక్కరికి రూ.200 చెల్లించి మరీ తీసుకొచ్చినట్టు విదేశీ నిధి రుసుములు చూపినట్టు ఆ ఎన్జీవోపై ఆరోపణలు వచ్చాయి. విదేశీ నిధుల క్రమబద్ధీకరణ చట్టం 2010 ప్రకారం, డబ్బు చెల్లించి జనాలను సమీకరించి ధర్నాలు నిర్వహించటం చట్టవిరుద్ధం. అయితే విదేశీ నిధుల క్రమబద్ధీకరణ చట్టం ముసాయిదా రూపొందించినవారికి ఇలా డబ్బు చెల్లించి సభలకు జనాలను తీసుకువచ్చే పద్ధతి ఉనికిలో ఉందని స్పష్టంగానే తెలుసు.

నిజానికి ధర్నాలు వంటి వాటికి ఉపయోగపడే వలంటీర్లు ప్రభుత్వేతర సంస్థలు కలిగిఉండవు. అంటే పార్టీకి వెన్నెముకగా కనిపించేవారు నిజంగా చెమటోడ్చి పనిచేసేవారు కారు. అలా చెమటోడ్చేవారిని చోటామోటా నేతలు ఇతరులకు ఔట్‌సోర్స్ చేస్తుంటారు. అయితే సర్పంచ్ కావచ్చు లేదా ఎంపీ కూడా కావచ్చు.. నాయకుడితో ఉండి జనాలను తీసుకువచ్చే ఈ తరహా సంస్కృతిలో ఇలాంటివారే పార్టీ శ్రేణులలో పైస్థానాలకు ఎగబాకుతూ ఉంటారు. ఎందుకంటే వీరికి నాయకులతో సాన్నిహిత్యం ఉంటుంది. ఇక పేలవమైన రాజకీయ కార్యకర్త అంటారా, అతడెవరు? ఎన్జీవోలు కూడా సరిగ్గా ఈ విషయంపైనే అప్పీలు చేస్తుంటాయి. ఇదీ మన రాజకీయ పార్టీల కార్యకర్తలకు సంబంధించిన వాస్తవ చిత్రణ.

(సాక్షి సౌజన్యంతో)


## జమ్మూ కాశ్మీర్ సార్వభౌమాధికారం భారత రాజ్యాంగానికి లోబడే..

**జ**మ్మూ కాశ్మీర్ రాజ్యాంగానికి ఉన్న సార్వభౌమాధికారం భారత రాజ్యాంగానికి లోబడే ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ రాష్ట్రంలోని పౌరులు తొలుత భారత పౌరులని, ఆ తర్వాతే కాశ్మీర్ వాసులని స్పష్టం చేసింది. కొన్ని దేశాలలో అమలులో ఉన్న విధంగా వారికి ద్వంద్వ పౌరసత్వం ఏదీ లేదని వివరించింది. రాష్ట్రంలో స్థిరాస్తులపై హక్కులకు సంబంధించి చట్టాలు చేసేందుకు రాష్ట్రానికి 'సంపూర్ణ సార్వభౌమాధికార హక్కులు' ఉన్నాయంటూ జమ్మూ కాశ్మీర్ హైకోర్టు ఇచ్చిన తీర్పు పూర్తిగా తప్పని పేర్కొంటూ కొట్టివేసింది. ఫెడరలిజాన్ని బలోపేతం చేసే క్రమంలో భాగంగా.. జాతీయ సమగ్రత పరిధిలో జమ్మూ కాశ్మీర్ సహా అన్ని రాష్ట్రాలకూ ఒకే తరహా స్వయంప్రతిపత్తి విధానాన్ని రూపొందించాలని లోక్‌సత్తా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

# ముందుచూపుతో ఉద్యమించండి!

- డాక్టర్ బూర నర్సయ్య గౌడ్
భువనగిరి పార్లమెంటు సభ్యులు

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర వహించిన కొందరు విద్యార్థి నాయకులు ఇటీవల నా దగ్గరకు వచ్చారు. ఎప్పటిలాగే అలవాటులో భాగంగా వారి యోగక్షేమాలు విచారించే ప్రయత్నం చేశాను. విషయం తెలుసుకున్న నా కళ్లు చెమ్మగిల్లాయి. 'ఏం చేస్తున్నారని' అడిగితే, 'మీకు తెలియదా సార్, రాజకీయాలలో ఉన్నాము' అన్నారు. 'ఎక్కడ ఉంటున్నారు?.. స్టడీ చేస్తున్నారా లేక జీవనోపాధి కొరకు ఏదైనా ఉద్యోగం చేస్తున్నారా?' అని అడిగాను. వారి నుంచి మౌనమే సమాధానమైంది. విషయం అర్థమైన నేను, 'మరి మీకు నెలనెలా అయ్యే ఖర్చు ఎలా భరిస్తున్నారు?' అని అడిగాను. దాంతో వాళ్లు భోరుమంటూ వారి బాధలన్నీ వెళ్లగక్కారు. నాకు నోట మాట రాలేదు. మాటలు కూడబలుక్కుని వాళ్లకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశాను.




వీరిలాగే చాలామంది విద్యార్థులు సామాజిక ఉద్యమాల్లోగానీ, తెలంగాణ ఉద్యమంలోగానీ తమ విలువైన సమయాన్ని, తమ భవిష్యత్తును ధారపోశారు. ముఖ్యంగా ప్రభుత్వ యూనివర్సిటీలలో, ప్రభుత్వ కాలేజీలలో చదువుకునే విద్యార్థులే వీరిలో ఎక్కువ. ప్రత్యేకించి వీరిలో బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు మరింత ముందున్నారు. ప్రతి సమస్యనూ తమ సమస్యగా తీసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో సామాజిక సమస్యలు, సిద్ధాంతపరమైన సమస్యలన్నింటినీ తమ భుజాన వేసుకున్నారు. తమ భవిష్యత్తును తాకట్టుపెట్టి, ముందుకు వెళ్లారు. అలానే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన విద్యార్థి సంఘాలలో క్రియాశీలకంగా పాల్గొన్న విద్యార్థులు ఉద్యమబాటలో నడుస్తున్న క్రమంలో రాజకీయాలనే తమ భవిష్యత్తుగా ఎంచుకున్నారు. సామాజిక స్పృహ వారిని ఈ పంథాలో నడిపించింది. దీనికితోడు పబ్లిసిటీ, వివిధ మీడియాల్లో వచ్చిన గుర్తింపు వారి ఆలోచనలకు బలాన్నిచ్చాయి. యూనివర్సిటీలు, కాలేజీలు కంచుకోటలుగా మారి, అదే ప్రపంచంగా జీవించారు. ఉద్యమ సమయంలో వివిధ పార్టీల ద్వారా వచ్చే ఆర్థిక వెనులుబాటు ఎంతకాలం ఉంటుందో వాళ్లు అప్పుడు ఆలోచించలేదు. ఇప్పుడు ఒక్కసారి యూనివర్సిటీలు దాటి, బయటి ప్రపంచంలోకి వచ్చిన తరువాత వారి జీవితాలు అగమ్యగోచరమయ్యాయి.

యూనివర్సిటీల్లో ఉన్న విద్యార్థి నాయకుల ఉడుకు రక్తం, సామాజిక మార్పు కొరకు పడే తపన, తెలంగాణ రాష్ట్రం కావాలనే కోరిక వారి భవిష్యత్తును సమాజం కొరకు అర్పించాయి. రాజకీయ ప్రతినిధులు కావాలనే కలలతో కూడా

కొందరు తమ విలువైన కాలాన్ని సమాజం కొరకు వెచ్చించారు. ఒక పక్క హాస్టల్ సౌకర్యం, మరోపక్క స్నేహితుల సమూహం వారికి ఒకరకంగా రక్షణ కల్పించాయి. కాగా, ఎన్నికలప్పుడు లేదా ఉద్యమ సమయంలో వారికి లభించిన ప్రత్యేక గుర్తింపు వారిని తమ భవిష్యత్తు గురించి ఆలోచించనీయకుండా ముందుకు నడిపింది. యూనివర్సిటీలలో రాజకీయ సిద్ధాంతాల మీద ఆధారపడిన సంఘాలు, ఎన్నికలు లేవు. అందువల్ల కుల సంఘాలు, వర్గ సంఘాలు లేదా ఇతరత్రా సంఘాలు ఏర్పాటుకు బాట పడింది. ఒకసారి వారు తమ యూనివర్సిటీ దాటి బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టినాక వారికి భ్రమలు తొలగిపోయి, సమస్యల వలయాలు కనిపిస్తాయి.

హాస్టళ్ల రక్షణ ముగిశాక చాలామంది విద్యార్థులకు ఎక్కడ ఉండాలో, ఏం తినాలో కూడా అర్థం కాని పరిస్థితి. అటు ఊళ్లో ఉండలేక, ఇటు పట్నంలో జాగా లేక సతమతం అవుతారు. చివరికి తల్లిదండ్రులకు భారంగా మారి, మరిన్ని ఇబ్బందుల్లో పడిపోతారు. అసలే తరుగుతున్న ఉద్యోగాలు. ఒక్కో ఉద్యోగానికి వందల, వేల సంఖ్యలో కాంపిటీషన్. వీళ్లు చూస్తే చదువుకోవాల్సిన విలువైన సమయాన్ని ఉద్యమాలకు అర్పించడంతో ఇతర విద్యార్థులతో పోలిస్తే వెనకంజలో ఉంటారు. ఈ సంగతి తెలుసుకుని మేల్కొనేసరికే జరగాల్సిన నష్టం జరిగిపోయి ఉంటుంది. సాధారణంగా అత్యధికులు పేద కుటుంబాల నుంచి వచ్చినవాళ్లు కాబట్టి కుటుంబంలో వ్యాపారవేత్తలు ఉండరు. ప్రత్యేకంగా బీసీలకు రాజ్యాంగపరమైన వెసులుబాటు లేదు కాబట్టి, అటు కులవృత్తులు చేసుకోలేక, ఇటు తల్లిదండ్రులపై ఆధారపడలేక బాధపడుతున్నారు. వారికి ఆర్థికంగా బలంగా ఉన్న బంధువులు గానీ లేదా వారి వర్గ రాజకీయ నాయకులూ లేకపోవడం ఒక అవరోధంలా ఏర్పడుతుంది. చాలామంది విద్యార్థి రాజకీయాలలో రాణించాలని కోరుకుంటారు. ఇందులో తప్పులేదు. దళిత గిరిజన నాయకులకు రిజర్వేషన్ కారణంగా కొంత వెసులుబాటు ఉన్నది. కానీ ప్రత్యేకించి బీసీ వర్గ విద్యార్థి నాయకుల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. ప్రస్తుతం ఉన్న డబ్బు రాజకీయాలలో తట్టుకుని నిలబడలేక, నిన్నటిదాకా ఉన్న గౌరవం, గుర్తింపు ఒక్కసారి మాయమైపోతాయి. రాజకీయ రిజర్వేషన్లు కూడా లేకపోవడంతో వారి పరిస్థితి వర్ణనాతీతం అవుతుంది.

సిద్ధాంతాల మీద ఆధారపడిన రాజకీయ పార్టీలలో అంచెలంచెలుగా ఎదిగే అవకాశం ఉంటుంది. దాని కులం, వర్గం లేదా ఒక సన్నివేశం మీద ఆధారపడి నడిచే ఉద్యమాలలో పాల్గొన్న విద్యార్థి నాయకులకు దీర్ఘకాలిక అవకాశం దొరకడం కష్టం. చాలామంది యువకులు రాజకీయ నాయకుల వెంట తిరుగుతూ ఉంటారు. నిజానికి వీళ్లు రాజకీయ నాయకుల వెంట ఉండటమే తమకు ఒక హోదాగా భావిస్తారు. దీనివల్ల తాత్కాలికంగా తమ పూట గడుస్తుంది. లేదా హోదా లభిస్తుంది. కానీ తమ జీవితం, భవిష్యత్తు గురించి ఆలోచించకుండా బ్లయిండ్‌గా ఫాలో అయిన అనేకమంది యువత మధ్యవయసు రాగానే మధనపడాల్సి ఉంటుంది. ఆర్థికంగా వెసులుబాటు ఉన్న కొందరు అధికార హోదా పొందినప్పటికీ, వారి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడిన పేదవర్గ యువత మాత్రం అవసరం తీరాక రోడ్డున పడతారు. అందుకే ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి కూడా సమంగా ఆలోచించాలి. మన మీద ఎన్ని కేసులున్నాయి, లేదా ఎన్నిసార్లు జైలుకు వెళ్లాము అనే అంశాలను పరీక్షల్లో గానీ, ఉద్యోగాల్లో గానీ అర్హతలుగా పరిగణలోకి తీసుకోరు. పేద విద్యార్థులు, యువకులు గమనించాల్సిన విషయం ఏమంటే, కేవలం ఎన్నికల సమయంలోనే వీరి అవసరం ఎక్కువగా ఉంటుంది. లేదా వాడుకుంటారు. ఈ విషయాన్ని గ్రహించకుండా అదే జీవితం అనుకుంటే పొరపాటే.

అన్నిటికీ చదువే ముఖ్యం. ఉదాహరణకు నేను ఎంబీబీఎస్ చదువుతున్నప్పుడు క్లాస్ రిప్రజెంటేటివ్‌గా, జూనియర్ డాక్టర్స్ ప్రెసిడెంట్‌గా పనిచేసినప్పుడు వైద్య విద్యార్థుల సమస్యల కొరకు అనేక ఉద్యమాలు చేపట్టాల్సి వచ్చింది. అలానే మండల రిజర్వేషన్ల ఉద్యమంలో పాల్గొన్నాను. అప్పుడు మా ప్రొఫెసర్లు పిలిచి, 'నీవు మెరిట్ స్టూడెంట్‌వి. ఈ ఉద్యమాలు నీకెందుకు' అని వారించారు. ముఖ్యంగా మండల రిజర్వేషన్ల ఉద్యమాలలో అటు ప్రొఫెసర్లు, ఇటు నా స్నేహితులు.. నీలాంటి మెరిట్ స్టూడెంట్‌కి రిజర్వేషన్లకు సంబంధించి ఉద్యమాలు అనవసరం అని వారించారు. కొన్ని సందర్భాలలో వాటి వల్ల నాకు వ్యక్తిగతంగా కలిగే నష్టాన్ని చెప్పి హెచ్చరించారు. నన్ను బాగా అభిమానించే ప్రొఫెసర్ హెచ్చరించినప్పటికీ నేను వాటిలో పాల్గొన్నాను. ఇందుకు కారణం సామాజిక స్పృహ చంపుకోలేకపోవడమే. అలాగని


నా చదువులోగాని, ప్రొఫెషన్‌లోగాని ఎలాంటి లోపం రానీయలేదు. ఆర్థికంగా స్థిరపడిన తరువాత తిరిగి తెలంగాణ ఉద్యమంలో పాల్గనడం, ఒక ఎంపీగా గెలవడం జరిగింది. తెలంగాణ ఉద్యమంలో పాల్గనే ముందు కూడా నా మిత్రులు, శ్రేయోభిలాషులు 'నీకు డాక్టర్‌గా మంచి గుర్తింపు ఉంది, తెలంగాణ ఉద్యమంలో పాల్గని టైం వేస్ట్ చేసుకోవద్దు' అని వారించారు. కానీ నాకున్న సామాజిక బాధ్యత నన్ను ఉద్యమం వెంట నడిపించింది. నేను తెలంగాణ ధ్యేయంగా, తెలంగాణ వస్తేనే సామాజిక న్యాయం జరుగుతుందని నమ్మి, స్వచ్ఛందంగా ఉద్యమకారుడ్ని అయ్యాను. ఒక్కసారి వెనక్కి చూస్తే, వైద్యవృత్తిలో రాణించకుంటే ఉద్యమంలోగాని, అసలు రాజకీయాల్లోగాని అవకాశమే వచ్చేది కాదని అనిపిస్తుంది.

విద్యార్థులు ఉద్యమాలలో పాల్గనడం కచ్చితంగా అవసరం. సామాజిక స్పృహలేని విద్య నిష్ఫలం. కానీ విద్య, ఉద్యమం రెండింటినీ సమన్వయం చేసుకుని నడిపించడం అవసరం. రెండు అంశాల్లో సమతుల్యం పాటించాలి. ముఖ్యంగా అభివృద్ధి చెందిన కులాల్లో ఉన్న విద్యార్థులకు కొంతవరకు వంశపారంపర్య సంపద, బంధువుల అండ ఉపయోగపడుతుంది. లేదా వారికి ఉన్న ఆర్థిక స్తోమత విద్యార్థి నాయకుల నుంచి నాయకులుగా మారడానికి ఉపయోగపడుతుంది. దళిత, గిరిజనులకు ఉన్న రాజ్యాంగ రిజర్వేషన్స్ కూడా కొంతవరకు సహకరిస్తాయి. అయితే అటు రాజ్యాంగ రక్షణ, ఇటు ఆర్థిక రక్షణ లేని విద్యార్థి నాయకులు మాత్రం ముందుచూపుతో వెళ్లడం మంచిది. ఉడుకు రక్తంతో ఉరకలు వేసే విద్యార్థి నాయకులకు, ముఖ్యంగా ఆర్థిక భద్రత, రాజ్యాంగ భద్రత లేని బడుగు బలహీనవర్గాల విద్యార్థి నాయకులకు నేను చెప్పేది ఒక్కటే. అవసరం అయినప్పుడు ఉద్యమాలు చేపడుతున్నప్పటికీ, మీ విద్యనూ, భవిష్యత్తునూ కాపాడుకుంటూ పయనించండి. ఏ పార్టీగాని, ఏ నాయకుడుగాని, విద్యార్థులు, యువత బాధ్యతను పూర్తిగా తమ భుజాన వేసుకోరు, వేసుకోలేరు. ఒక ఇంగ్లిష్ సామెత చెప్పినట్టుగా, 'యుక్తవయసులో కమ్యూనిస్టు కానివాడికి హృదయం లేదు. మధ్యవయసులో క్యాపిటలిస్టు కానివాడికి బుర్ర లేదు' అనేది వాస్తవం. ఒకసారి మన తెలుగు రాష్ట్రాలలో ఉన్న నాయకత్వం చూస్తే కమ్యూనిస్టు రాజకీయాలు చేసిన ఆధిపత్య కులాల విద్యార్థి నాయకులు చాలామంది వ్యాపారవేత్తలుగా, విద్యాసంస్థల అధిపతులుగా ఎదిగారు. కానీ అదే సిద్ధాంతాలకు తమ జీవితాన్ని అర్పించిన బడుగు బలహీనవర్గాల విద్యార్థి నాయకులు మాత్రం కనుమరుగయ్యారు. విద్య, సామాజిక బాధ్యత, భవిష్యత్‌ల పట్ల సమతుల్యం పాటిస్తూ ముందుకు వెళ్లడమే బడుగు, బలహీన విద్యార్థి నాయకులకు క్షేమమని నా సూచన. మైండుతో ఆలోచించకుండా బ్లయిండ్‌గా ఫాలో అయితే భవిష్యత్తు బ్యాడ్‌గా మారుతుంది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

# మంచిని చెప్పడంలో పెద్దలుగా విఫలమయ్యాం

స్వాతంత్ర్య దినోత్సవాన్ని కూడా ఈతరం సెలవు దినంగా భావిస్తోందంటే, మా తరం చేసిన పొరపాటే" అని కేంద్ర విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ) కె.వి చౌదరి అన్నారు. త్యాగధనుల నుంచి నేర్చుకోవాల్సింది ఏముందో ముందు తరాలకు చెప్పడంలో విఫలమయ్యామన్నారు. ప్రసార భారతి – ఆకాశవాణి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యాలు చేశారు. ఆదర్శమూర్తులైన స్వతంత్ర సమరయోధులు ఎలాంటి భారతదేశాన్ని కోరుకున్నారో అలాంటి దేశాన్ని నిర్మించుకోవడానికి స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే వంటి వేడుకల్ని జరుపుకోవాలన్నారు.



# జవసత్వాలున్న యువ నాయకత్వం కావాలిప్పుడు!

- డా॥ జయప్రకాష్ నారాయణ్



ప్రధానమంత్రి వాజపేయి ఇటీవల అమెరికాలో పర్యటించటం వల్ల భారత, అమెరికా సంబంధాల మాటేమోగానీ, నాయకత్వాలలో వయో భేదం కొట్టొచ్చినట్టు కనబడింది. బిల్ క్లింటన్ 46 సంవత్సరాల వయసులో అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. రెండు పర్యాయాలు, ఎనిమిది సంవత్సరాలు అధ్యక్షుడిగా పనిచేసి 54 సంవత్సరాలు పూర్తయ్యేనాటికి ఆయన ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన పదవి నుంచి వైదొలుగుతారు. బ్రిటన్‌లో టోనీ బ్లెయిర్ 40 సంవత్సరాలు నిండకుండానే ప్రధానమంత్రి అయ్యారు. ఇప్పటికే ఆయన 3 సంవత్సరాల పాటు తమ పార్టీ నాయకుడిగా ఉన్నారు. ఆయనకు ముందు ప్రధానమంత్రిగా ఏడేళ్లు పనిచేసిన జాన్ మేజర్ ఇప్పటికి కూడా 60 సంవత్సరాలకు కాస్త అటూఇటుగా ఉన్నారు. బ్రిటన్‌లో ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ నాయకుడికి ఇంకా 40 ఏళ్లు నిండలేదు. 16 సంవత్సరాలపాటు ఛాన్సెలర్‌గా పనిచేసి, జర్మనీ ఏకీకరణలో ప్రధానపాత్ర వహించిన హెల్మట్‌కోల్ వయసు నేటికి కూడా 70 ఏళ్ల లోపే! జర్మనీ ప్రస్తుత ఛాన్సెలర్ ష్రోడర్, ఫ్రెంచ్ ప్రధానమంత్రి లయొనెల్ జోస్పిన్, పెరూలో రెండుసార్లు అధ్యక్ష పదవి చేపట్టి, మూడోసారి ఎన్నికలలో అప్రతిష్టపాలై పదవి నుంచి వైదొలుగుతున్న ఫుజిమోరి – ఇలా ఎన్నో ప్రజాస్వామ్య దేశాలలో ఎక్కడ చూసినా యువ నాయకత్వం కనిపిస్తుంది. నాయకులకు ఆరోగ్యం, శక్తిసామర్థ్యాలు, దేహదారుఢ్యం, చురుకుదనం ఉండటం కనీస అర్హతలుగా ఆ సమాజాలు భావిస్తాయి.

### వృద్ధాప్యమే అర్హత?

మనదేశంలో పరిస్థితి చూస్తే చాలా విచిత్రంగా కనిపిస్తుంది. ప్రధానమంత్రికి 76 సంవత్సరాలు. ఆయన ఆరోగ్యం మీద, చురుకుదనం మీద ఎన్నో సందేహాలున్నాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు వయసు 87 ఏళ్లు. విశ్రాంతి కావాలన్న ఆయన కోర్కెను పార్టీ ఎట్టకేలకు మన్నించింది. తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి, కేరళ ముఖ్యమంత్రి నయనార్, పంజాబ్ ముఖ్యమంత్రి ప్రకాష్‌సింగ్ బాదల్, కేరళలో అవకాశం వస్తే మరోసారి ముఖ్యమంత్రి కాగోరుతున్న కరుణాకరన్, ప్రధానమంత్రులుగా పనిచేసిన ఇందర్ గుజ్రాల్, పి.వి నరసింహారావు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులలో అధికులు – ఇలా చాలా నాయకత్వ స్థానాలలో ఉన్నవారిలో చాలామంది వయసు మళ్లినవారే. నాయకత్వానికి వయ:భేదం లేదని వాదించేవారున్నారు. నిజమే, అవినీతిపరులయిన యువనాయకుల కంటే నిజాయతీపరులయిన వృద్ధ నాయకులే మేలు. వృద్ధులయినంత మాత్రాన పరిణతి ఉంటుందనిగానీ, జాతి భవిష్యత్తు కోసం దూరదృష్టి

గల నిర్ణయాలు తీసుకుంటారనిగానీ హామీ ఏదీ లేదు. ఇందర్ గుజ్రాల్ మంత్రివర్గం అయిదో వేతన సంఘం సిఫారుసులను అయిదు నిముషాలలో ఆమోదించి మన ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టింది. ఒకసారి పదవి వచ్చాక ఏదోవిధంగా శాశ్వతంగా దాన్నే అంటిపెట్టుకుందామన్న తపన వృద్ధులకు కూడా ఉంటుంది. అసలు దేశంలో మధ్యవయస్కులు, యువకులు అయిన నాయకులే లేరని కాదు. ములాయంసింగ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్, మాయావతి, చంద్రబాబు నాయుడు, దిగ్విజయ్ సింగ్, అశోక్ గెహ్లాట్, నవీన్ పట్నాయక్, మహంతా, చౌతాలా – ఇలాంటి వారెంతోమంది ఉన్నారు. వీరిలో చాలామంది ఉద్యమాల వల్ల వచ్చారు లేదా కుటుంబ పాలనలో భాగంగా బంధువుల అండతో వచ్చారు లేదా అధినాయకుల ఆశీస్సులతో వెలుగులోకి వచ్చారు. నిజంగా స్వయంప్రకాశంతో యువనాయకత్వం వెలుగొందటం దాదాపు అసాధ్యంగా పరిణమించింది. వయసు ఆధారంగా భారత్‌లో జనాభా వర్గీకరణను చూస్తే ఎన్నో వింతలు గోచరిస్తాయి. జనాభాలో 77శాతానికి పైగా నలభై నిండనివారే! 71శాతం ప్రజలు 35 సంవత్సరాలలోపు వారే! అయినా అధికారం మొత్తం వృద్ధతరం వారి చేతుల్లోనే చిక్కుకుపోయింది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన రాజేష్ పైలట్ వయసు ఆనాటికి 54 సంవత్సరాలు. అంతకంటే ఎక్కువ వయసున్న వాళ్లు దేశజనాభాలో కేవలం 9.4శాతం మాత్రమే. అయినా రాజేష్ పైలట్ తిరుగుబాటు బావుటా ఎత్తినప్పుడో, పార్టీ నాయకత్వం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా పోటీపడ్డప్పుడో, ఎంతోమంది 'పెద్దలు' పెదవి విరవటం చూశాం! "ఈ కుర్రాడికి ఇంకా పరిణతి రాలేదు. కుర్ర వయసులోనే నాయకుణ్ణయిపోదామనే అత్యాశ ఉంది" అని ఎందరో విమర్శించారు. అదే పెద్దలు, కేవలం ఓ కుటుంబంలో పుట్టి వంశపారంపర్యంగా పదవి వచ్చినంత మాత్రాన లేదా కుటుంబ పాలనలో భాగంగా రేపు 'నాయకుడై' వెలుగొందుతాడనుకున్నప్పుడు, బద్దులని వాళ్లను మహానాయకులుగా, మేరు నగధీరులుగా కీర్తించటం కద్దు! అంటే నిజంగా నాయకత్వ లక్షణాలు, ఏదో చేద్దామనే తపన ఉన్నవాళ్లు ఈ పెద్దల కంటికి ఆనరు. ఎందుకూ కొరగాని ప్రబుద్ధులు మాత్రం కుటుంబ కారణంగా నాయకత్వానికి అర్హులు! ఇలాంటి విపరీత మనస్తత్వం, చిత్తచాంచల్యం, ఏమాత్రం మార్పుని ఆహ్వానించని జడత్వం, ఈ రాచరిక దాస్య భావం మన రాజకీయాన్ని, జాతిని కలుషితం చేస్తున్నాయి.

## నాయకత్వాన్ని అణచే సమాజం

ఓ కుటుంబంలో బిడ్డల పెంపకాన్ని చూస్తే మన సమాజం ఎలా పిల్లల్లో ఆలోచనను, నాయకత్వ పటిమను అణచివేస్తోందో తెలుస్తుంది. "నీకేం తెలీదు, నోరు మూసుకో", "చొప్పదంటు ప్రశ్నలు వేయకు", "చెప్పింది చెయ్యి", "సొంత తెలివి ప్రదర్శించకు", "చెప్పిన మాట బుద్ధిగా విను", "మారు మాటాడకు" – ఇలాంటి పదజాలం పిల్లల పెంపకంలో సాధారణంగా వాడటాన్ని గమనిస్తున్నాం. ఇలా సృజనాత్మక శక్తిని, ఆలోచనను హరించేసి, చదువంటే కేవలం బట్టీపట్టి కొన్ని సమాధానాలను ముక్కునపెట్టి, ఏదోలా మార్కులు తెచ్చుకోవటమేననుకుంటున్నాం. అందుకే ఎంతోమంది చేసే పనిలో శ్రమ ఉన్నా ఆ పని వెనక ఏమాత్రం ఆలోచనగానీ, మెళకువలుగానీ కనిపించవు! వందకోట్ల జనాభా ఉంది కాబట్టి, అందులో ఒకటి, రెండు శాతానికి అవకాశం వచ్చినా కోట్లమంది ప్రతిభావంతులు, సంపద సృష్టిలో భాగం పంచుకునేవాళ్లు కనిపిస్తారు. అందునా ఆధునిక విజ్ఞానరంగంలో, మేధ పెట్టుబడిగా, నైపుణ్యమే బలంగా ఉండే పరిశ్రమలలో భారతీయులు ఇంటా, బయటా పైకెగబాక గలుగుతున్నారు. ఇది సంతోషించదగ్గ పరిణామం. అయితే ఈ రంగాలలో కూడా మనకున్న అవకాశాలతో పోలిస్తే మన ప్రగతి చాలా తక్కువ. నేటికీ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ రంగంలో మన ఎగుమతులు ప్రపంచంలో ఒక శాతం లోపే! ఆలోచనాపరులు, ప్రతిభావంతులయిన యువత రాజకీయం వైపు చూసే సాహసం చేయటం లేదు. "రాజకీయమంతా రొచ్చు", "అదంతా కుట్రలమయం", "నేరస్తులకే అక్కడ స్థానముంది", "ఆ అవినీతి బురదలో కూరుకుపోవటం అసహ్యకరం" – ఇలా భావించే యువత అత్యధికంగా ఉన్నారు. ఇక దేనికీ పనికిరారనుకున్నవాళ్లు, నేరచరిత్ర ఉన్నవాళ్లు, ఏదోవిధంగా సంపాదించి ఆ డబ్బు వెదజల్లి కాస్త గౌరవం పొందుదామనుకునేవాళ్లు, కుటుంబ వారసత్వంగా రాజకీయ పదవులు పొందేవాళ్లు – మాత్రమే ఎక్కువగా ఈ ఎన్నికల బరిలోకి, రాజకీయంలోకి ప్రవేశించే సాహసం చేస్తున్నారు. నిజంగా మంచి యువత రాజకీయంలోకి చిత్తశుద్ధితో ప్రవేశించినా వాళ్లు ఎదగటం, మంచి మార్గాన్ని చూపటం దాదాపు అసాధ్యమయిపోయాయి. ఓ గాంధీ, ఓ అంబేద్కర్ పోటీచేస్తేనే ఓడిపోయే ఎన్నికల హంగామా నడుమ యువత బెంబేలెత్తటం సహజం.

**వయసు ఆధారంగా భారత్‌లో జనాభా వర్గీకరణ**

| వయసు | జనాభా శాతం |
|---|---|
| 24 సంవత్సరాల లోపు | 55.6 |
| 29 సంవత్సరాల లోపు | 63.9 |
| 34 సంవత్సరాల లోపు | 70.9 |
| 39 సంవత్సరాల లోపు | 77.1 |
| 60 సంవత్సరాల పైబడి | 6.8 |
| 65 సంవత్సరాల పైబడి | 4.1 |
| 70 సంవత్సరాల పైబడి | 2.6 |
| 75 సంవత్సరాల పైబడి | 1.3 |

**'రాజకీయం మారాలి'**

నిజమైన రాజకీయం అత్యంత పవిత్రమయిన వ్యాసంగం. స్వచ్ఛమైన రాజకీయం ప్రజల సుఖసంతోషాలను పెంపొందించేది. అలాంటి రాజకీయం దేశవ్యాప్తంగా కేవలం పదివేల కుటుంబాల శాశ్వత సొత్తుగా మారినప్పుడు, అది కూడా కుటుంబ ఆస్తిలో భాగమయినప్పుడు, ఎందుకూ కొరగాని గూండాలు, అధములు మాత్రమే పాలుపంచుకునే దారుణ ప్రక్రియగా రూపొందినప్పుడు జాతి నాశనం కావటం తథ్యం. అందుకు యువతను నిందించి ప్రయోజనం లేదు. మంచి వాళ్లు నిజాయతీతో రాజకీయంలో మనగలిగే వ్యవస్థను సృష్టించుకోవటం అత్యవసరం. మరే పనికీ ఉపయోగపడని నిరర్థకుల ఆవాసంగాకాక, జాతి రత్నాలను ఆకర్షించే అయస్కాంతంగా రాజకీయం మారాలి. ప్రస్తుత దారుణ వ్యవస్థ వల్ల అధికారం పొంది, అంతులేని దోపిడీని కొనసాగిస్తున్న రాజకీయ నాయకులు ఓ పట్టాన మారరు. ఈ వ్యవస్థను మారనివ్వరు. యువత నిర్భీతితో ఎదురుతిరగాలి. అధికారం, అవకాశం.. ఇస్తే వచ్చేవి కావు, చొరవతో వాటిని పుచ్చుకోవాలి. సమర్థులయిన యువత, విజ్ఞత గల పౌరులు, మేధాశక్తిగల వ్యక్తులు, చిత్తశుద్ధిగల ఉత్తములు రాజకీయంలోకి ప్రవేశించే అవకాశం రావాలి. అందుకు సమూల ప్రక్షాళన జరగాలి. రిచర్డ్ నిక్సన్ ఓ మామూలు కుటుంబానికి చెందిన 'లా' పట్టభద్రుడు. బిల్ క్లింటన్ బీద కుటుంబంలో కన్నతండ్రి లేకుండా, బాల్యంలో కుటుంబంలో దౌర్జన్యానికి గురయి బిక్కుబిక్కుమంటూ పెరిగిన విద్యార్థి. జాన్ మేజర్ ఓ మామూలు సర్కస్‌లో పనిచేసే ట్రెపీజ్ ఆర్టిస్ట్ కుమారుడు. ప్రజాస్వామ్యం సరిగ్గా నడిస్తేనే పుట్టుకతో నిమిత్తం లేకుండా, కేవలం ఆలోచన, పరిశీలన, సమాజ సేవానిరతి ఉన్నవాళ్లకు నాయకత్వ అవకాశాలుంటాయి. లేకపోతే ఆస్కార్ వైల్డు చెప్పినట్టు, రాజకీయం పరమ దుర్మార్గుల ఆవాసంగా మిగిలిపోతుంది. మన దేశ దుస్థితి అదే. యేట్స్ చెప్పినట్టు – "అత్యుత్తములు, సమర్థులు నిస్సహాయులై, పిరికిపందలై, అచేతనులై కూర్చున్నారు. దుష్టులు, అతి నీచులు, ఎందుకూ కొరగానివాళ్లు ఎంతో తెగువను, దుస్సాహసాన్ని ప్రదర్శిస్తున్నారు.'' ఈ పరిస్థితిని మార్చే తరుణం ఆసన్నమయింది. అంతా అయిపోయాక వాపోయేకన్నా సమయం మించిపోకుండా అడుగు ముందుకు వేయటం మిన్న.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా అక్టోబర్ 30, 2002న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం)

# యువసత్తాలో 133వ స్థానం

ప్రపంచ యువజన అభివృద్ధి సూచీలో భారతదేశం ఏకంగా 133వ స్థానంలో ఉన్నట్టు కామన్వెల్త్ సచివాలయం ఇటీవల నిర్వహించిన విశ్లేషణలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా ఉపాధి, విద్య, ఆరోగ్యం, రాజకీయ పౌర సంబంధాల్లో యువత అవకాశాలపై ఈ విశ్లేషణ సాగింది. ఇరుగుపొరుగున వున్న నేపాల్, భూటాన్, శ్రీలంక కంటే కూడా భారత్ ఎంతో వెనకబడివున్నట్టు ఇటీవల విడుదల చేసిన ఈ నివేదిక స్పష్టం చేసింది. కనీసం దక్షిణాసియా ప్రాంతంలో సైతం భారత్‌కు మెరుగైన స్థానం దక్కలేదు. సగటు కంటే కూడా తక్కువ శాతంతో వెనకబడి ఉందని విశ్లేషణ నివేదిక వెల్లడించింది. అయితే 2010, 2015 సంవత్సరాలలో సంబంధిత రంగాల్లో కనీసం 11శాతంతో భారత్ చక్కని మెరుగుదలను చూపింది. అయితే, తాజా విశ్లేషణ ప్రకారం భారతీయ విద్య, వైద్య, ఉపాధి రంగాలలో బాగా వెనకబడి ఉంది. ఆయా రంగాల్లో యువత అవకాశాలు గనక మెరుగైతే పరిస్థితిలో గణనీయమైన మార్పు వస్తుంది. భారత్‌లో యువత జనాభా ప్రపంచ యువ జనాభాలో 20శాతం దాకా ఉంది. ముఖ్యంగా 15–30 ఏళ్ల వయసు వారి సంఖ్యే సుమారు 34కోట్ల పైచిలుకుగా ఉంది. ప్రపంచ యువజన అభివృద్ధి సూచీ ప్రకారం జర్మనీ ప్రథమ స్థానంలో ఉంది. డెన్మార్క్, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, యూకే తరువాతి స్థానాల్లో ఉన్నాయి. మొత్తం మీద ఐరోపా దేశాల కంటే మన విద్యార్థులు చురుకైనవారనే పేరు వున్నా, ప్రభుత్వాల విధానాల వల్ల ఆ దేశాల్లోవారి కన్నా మన యువత వెనకబడి వున్నారని ఈ సూచీ హెచ్చరిస్తోంది.

# అవినీతి నిరోధక చట్టంలోని మతిలేని సవరణలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్నీ సమీకరిస్తాం

అవినీతి నిరోధక చట్టం 1988కి బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మతిలేని సవరణలను పార్టీలకతీతంగా తిరస్కరించాలని లోక్‌సత్తా పార్టీ కర్ణాటక విభాగం రాష్ట్ర పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేసింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలలో ఈ బిల్లు ఆమోదం పొందలేదుకాబట్టి వచ్చే సమావేశాలలో మళ్లీ ప్రవేశపెడతారని.. ఎప్పుడు సభ ముందుకు వచ్చినా ఈ సవరణల్ని తిరస్కరించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఫణిసాయి భరధ్వాజ, కార్యదర్శి రవికిరణ్ కాంబ్లే కోరారు. ఈ బిల్లులో కేంద్రం అధికారికంగా ఆమోదించిన 17 'ఎ' సవరణ వల్ల అవినీతి ఆరోపణలు వచ్చిన ప్రభుత్వ ఉద్యోగి మీద ముందస్తు అనుమతి లేకుండా, అది కూడా లోక్‌పాల్ లేదా లోకాయుక్త అనుమతిలేకుండా కనీసం కానిస్టేబుల్ కూడా దర్యాప్తు చేసే అవకాశముండదని అన్నారు. అలాగే తమకు హక్కుగా అందాల్సిన సేవలకు లంచం ఇచ్చినా కూడా ప్రజలకు జైలుశిక్ష విధించేలా సెక్షన్ 8ని చేర్చారన్నారు. ఈ రెంటినీ తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానంలో భాగంగా నిర్ణయాలు తీసుకునే సందర్భంలో మాత్రమే ప్రభుత్వోద్యోగులకు ముందస్తు అనుమతి రక్షణ కల్పించాలని, అలాగే లాలూచీ పడి దేశానికి నష్టమొచ్చేలా లంచం ఇచ్చినవారికి మాత్రమే జైలు శిక్ష విధింపును వర్తింప చేయాలన్నారు. ఈ అంశాలన్నిటినీ సమగ్రంగా వివరిస్తూ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, సంబంధిత మంత్రులకు, ఎంపీలకు లేఖలు రాశారన్నారు. సవివరంగా నోట్‌ను (దిగువన చదవొచ్చు) కూడా జతపరిచారన్నారు. పార్లమెంటు వచ్చే సమావేశాలలోపు ఈ అంశాలన్నిటినీ జనంలోకి తీసుకెళ్లి ప్రజాభిప్రాయాన్ని కూడా సమీకరిస్తామని పార్టీ నేతలు తెలిపారు.




### అవినీతి నిరోధక చట్టం, 1988కి ప్రతిపాదించిన సెక్షన్ 17 'ఎ', సెక్షన్ 8 విపరిణామాలు

**(అవినీతి నిరోధక చట్టసవరణ బిల్లులోని లోపాల్ని వివరిస్తూ లేఖతోపాటు కేంద్రానికి, ఎంపీలకు లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ పంపిన నోట్ స్థూలపాఠం)**

ప్రభుత్వ నిర్ణయాలలో సదుద్దేశపు సలహాలనిచ్చే, నిర్ణయాలను తీసుకునే పైస్థాయి, సీనియర్ అధికారులను విచారణ పేరుతో నిర్లక్ష్యపూరిత ధోరణితో వేధించటం వల్ల ప్రభుత్వ పాలన కుంటుపడుతుందని మేం అంగీకరిస్తాం. ఇటీవల కొంతమంది ప్రభుత్వాధికారులను వారి చర్యలు, నిర్ణయాలు చట్టబద్ధం అయినప్పటికీ, ఎడతెగని విచారణలతో వారిని వేధించటం వల్ల పాలన అచేతనంగా మారి ప్రజలకు ఎనలేని నష్టం వాటిల్లింది. అందువల్ల ప్రభుత్వస్థాయిలో ఎవరైతే వారి విధులు ప్రభుత్వ విధానాల నిర్ణయాలకు సంబంధించి నిర్వహిస్తారో అటువంటి ప్రభుత్వాధికారులకు విచారణ పేరుతో వేధింపుల నుంచి మినహాయింపు, రక్షణ కల్పించాలని భావిస్తున్నాం. కానీ ఈ మినహాయింపుని 2కోట్ల మంది ప్రభుత్వాధికారులందరికీ వారి విధులతో సంబంధం లేకుండా కొనసాగించటం లేదా పొడిగించటం అనేది అవినీతి నిరోధక శాఖలన్నింటినీ, అవినీతి నిరోధక చట్టాలనూ దెబ్బతీయటమేకాకుండా ప్రభుత్వాలపై మోయలేని భారం మోపుతుంది. తర్వాత అరికట్టలేని అవినీతి సంస్కృతిని ప్రోత్సహిస్తుంది. అవినీతిని అంతం చేయటం సాధ్యంకాదనే వాతావరణం మధ్య అవినీతి తిమింగలాలు తప్పించుకుంటాయి. అందువల్ల ప్రభుత్వోద్యోగులందరికీ రక్షణ స్థానంలో.. ప్రభుత్వ విధాన నిర్ణయాలకు సంబంధించిన అంశాలలో మాత్రమే ఉద్యోగులకు రక్షణ కల్పించాలి.

రెండవది, అవినీతి ప్రబలంగా ఉన్న సమాజంలో ప్రభుత్వోద్యోగులకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక చర్యలను

(తరువాయి....21వ పేజీలో)

# సామాన్య ప్రజలను జైలుకు పంపుతూ లంచగాండులకు అండగా ఉండే.. అవినీతి నిరోధక చట్ట సవరణల్ని వ్యతిరేకిద్దాం: సీఐసీ మాడభూషి శ్రీధర్



కేంద్ర ప్రభుత్వం అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లుకు అధికారికంగా ఆమోదించిన సవరణలు.. అవినీతిపరులను రక్షించే విధంగా, లంచాల బాధితులుగా ఉన్న సామాన్య ప్రజలను శిక్షించే విధంగా ఉన్నాయని, వీటిని సరిదిద్దేవరకు ప్రజా ప్రతినిధులు, సంఘాలు, ప్రజలు పార్టీల కతీతంగా పోరాటం చేయాలని కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. పరిజ్ఞానంతో ప్రశ్నించటం అలవాటు చేసుకుని ప్రభుత్వాలు చేపట్టే ప్రజా వ్యతిరేక చర్యలను ప్రతిఘటిస్తుంటేనే జనం జీవితాలు బాగుపడతాయన్నారు.

అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లులోని తప్పుడు సెక్షన్లకు వ్యతిరేకంగా తొలి నుంచీ పోరాడుతున్న లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజీగూడలోని కేంద్ర కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి లోక్‌సత్తా ఉద్యమసంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు అధ్యక్షత వహించారు.

మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ.. అవినీతి నిరోధక చట్టానికి ప్రస్తుతం చేసిన సెక్షన్ 8 సవరణ లంచాల బాధితులైన ప్రజలనే శిక్షించే విధంగా ఉందన్నారు. లంచం తీసుకోవడం ఎంత నేరమో, ఇవ్వడమూ అంతే నేరం అన్న సహజ సూత్రాన్ని దోపిడీదారులతో కుమ్మక్కయి లంచాలిచ్చేవారికి వర్తింపచేస్తారుగానీ.. హక్కుగా రావాల్సిన సేవలకు గతి లేక లంచాలు ఇచ్చే సామాన్యులను వర్తింపచేస్తారా? అని ప్రశ్నించారు. లంచం ఇచ్చేవాడికి, పుచ్చుకునేవాడికి పరస్పర లాభం ఉండి, దేశానికి నష్టం జరిగే 'క్విడ్ ప్రోకో' లాంటి కేసుల్లో మాత్రమే లంచం ఇచ్చేవారిని శిక్షించేవిధంగా చట్టాన్ని మార్చాలన్నారు. మరోపక్క, లంచం తీసుకునే అధికారిని మాత్రం ప్రాసిక్యూట్ చేయటం మాట అలా వుంచి, కనీసం దర్యాప్తు చేయటానికి కూడా ముందస్తు అనుమతి కావాలనే దారుణమైన 17 'ఎ' సవరణను ఇందులో చేర్చారన్నారు. ఈ సవరణల్ని తొలగించేలా పార్టీలకతీతంగా లోక్‌సత్తా చేస్తున్న కృషిని అభినందించారు. సమాచార హక్కు చట్టం, నోట్ల రద్దు, నల్లధనం, అవినీతిపై పలు ప్రశ్నలకు ఈ సందర్భంగా శ్రీధర్ జవాబిచ్చారు.

అవినీతి నిరోధక చట్టానికి ప్రభుత్వం ఆమోదించిన దుర్మార్గపు సవరణలకు వ్యతిరేకంగా ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, సంబంధిత మంత్రులు, పార్లమెంటు సభ్యులందరికీ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ లేఖలు రాశారని, రౌండ్‌టేబుల్ సమావేశాలు, మీడియా ద్వారా కూడా ప్రజలను చైతన్యపరిచే ప్రయత్నాలు చేస్తున్నామని బండారు రామ్మోహనరావు తెలిపారు. ఈ సవరణల్ని తొలగించి.. కుమ్మక్కయి లంచం ఇచ్చేవారికి మాత్రమే శిక్షల్ని పరిమితం చేసేలా, ప్రభుత్వ విధానాలలో భాగంగా తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి మాత్రమే అధికారులకు రక్షణ కల్పించేలా కొత్త సవరణల్ని చేయాలన్నారు. అవినీతిపరుల ఆస్తుల్ని జప్తు చేసే ఏర్పాటును కూడా సవరణల్లో చేర్చాలన్నారు.

సమావేశంలో లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీశైలం, లోక్‌సత్తా ఉద్యమసంస్థ మాజీ కన్వీనర్లు టీఎల్ నరసింహారావు, ఎన్. శ్రీనివాస్, కోశాధికారి పి. భాస్కరరావు, ఆర్‌టీఐ కార్యకర్తలు, విద్యార్థిసత్తా, యువసత్తా నాయకులు పాల్గొన్నారు.

(19వ పేజీ తరువాయి....)

చేపట్టటానికి విశ్వసనీయ ఆధారాలు అవసరం. భారత్ వంటి దేశంలో రోజువారీ చిన్న చిన్న పనుల్లో అవినీతి విస్తృతంగా ఉంటుంది. హక్కుగా సేవలు పొందాల్సిన పౌరులు లేదా బృందాలు ప్రభుత్వ బాధితులుగా ఉంటుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో, లంచం ఇచ్చేవాడికి (గతిలేక బలవంతంగా) రక్షణ కల్పించటం చాలా ముఖ్యం. సర్వవ్యాప్తమైన అవినీతి మధ్య వారికి సేవలు లంచాలు లేకుండా అందటం దుర్లభం. సేవల కోసం వచ్చిన పౌరులను వేధించటం, ధ్రువపత్రాలు, నీరు, విద్యుత్తు కనెక్షన్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, దస్తావేజులు, భవన నిర్మాణ ప్రణాళిక ఆమోదం వంటి వాటికి లంచాలివ్వాల్సిందే. దురదృష్టవశాత్తూ ప్రభుత్వం ఈ వాస్తవాన్ని గుర్తించకుండా లంచం సమర్పించుకునేవారందరినీ శిక్షార్హులను చేస్తూ అవినీతి నిరోధక చట్టంలో సవరణ ప్రతిపాదించింది. సెక్షన్ 8(1) ప్రతిపాదన ప్రకారం, ముడుపులు ఏరూపంలో చెల్లించినా, సాధారణ పౌరులు తమకు హక్కుగా అందాల్సిన సేవల కోసం చెల్లించినా శిక్షార్హులుగా పరిగణించబడతారు. ఈ చట్టం కింద కనిష్టంగా 3 ఏళ్లు, గరిష్టంగా 7 ఏళ్లు జైలు శిక్ష ఉంటుంది.

### సెక్షన్ 17 'ఎ'ని చేర్చటం వెనక నేపథ్యం

1) అవినీతి నిరోధక చట్టం, 1988 కింద దర్యాప్తు సంస్థలకు పూర్తిస్థాయి స్వేచ్ఛను మంజూరు చేయటం జరిగింది. ఆరోపణలను ఎదుర్కొనే ప్రభుత్వోద్యోగులను పూర్తిస్థాయిలో విచారించటానికి ఎటువంటి అనుమతి అక్కర్లేదు. అయినప్పటికీ సెక్షన్ 19 (1), అవినీతి నిరోధక చట్టం 1988 కింద, సెక్షన్ 197 శిక్షాస్మృతి ప్రకారం విచారణకు ముందస్తు అనుమతి అవసరం.

2) 2003లో సెక్షన్ 6 'ఎ' ప్రకారం కేంద్ర దర్యాప్తు సంస్థతో ఢిల్లీ ప్రత్యేక పోలీసు స్థాపన చట్టం, 1946ను ప్రవేశపెట్టింది. ఈ విభాగం జాయింట్ సెక్రటరీ నుంచి పైస్థాయి అధికారులను విచారించుటకు కేంద్ర దర్యాప్తు సంస్థ, ప్రభుత్వం ముందస్తు అనుమతి తీసుకోవాలని ప్రతిపాదించింది.

3) 2014లో ప్రజావ్యాజ్యాలను విచారిస్తూ సుప్రీంకోర్టు సెక్షన్ 6'ఎ'ని కొట్టివేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని, సమన్యాయాన్ని అతిక్రమించటమని పేర్కొంది.

4) ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం.. పెండింగ్‌లో ఉన్న అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లు 2013లో మళ్లీ దీన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం కొత్తగా 17 'ఎ'ని ప్రతిపాదించింది.

### ప్రతిపాదిత 17 'ఎ' విపరిణామాలు

సెక్షన్ 17 'ఎ'ప్రకారం – పోలీసు లేదా దర్యాప్తు సంస్థ.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయమున్న కేసులలో లోక్‌పాల్ అనుమతి తీసుకోవాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి లోకాయుక్త అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలి. ఒకవేళ ప్రభుత్వోద్యోగి అన్ని ఆధారాలతో దొరికిపోతే తప్ప.. అని ఒక సందర్భాన్ని మినహాయించింది. పోలీసు లేదా దర్యాప్తు సంస్థకు చేసిన ఫిర్యాదు లోక్‌పాల్ లేదా లోకాయుక్త అనుబంధ కేసుగా పరిగణించబడుతుంది. లోక్‌పాల్ లేదా లోకాయుక్త ఛాప్టర్ 7, లోక్‌పాల్ మరియు లోకాయుక్త చట్టం 2013 ప్రకారం నిర్దేశిత పద్ధతిలోనే కేసుకు సంబంధించి వ్యవహరించాల్సి ఉంటుంది.

లోక్‌పాల్, లోకాయుక్తలు విచారణకు అనుమతి మంజూరు చేయటానికి తీవ్ర జాప్యం జరిగే అవకాశముంది. లోక్‌పాల్ లేదా లోకాయుక్త అనుమతి లభించక పదుల వందల కేసులకు అనుమతి లభించక విచారణ కుంటుపడుతుంది. భారత్‌లో దాదాపు 2 కోట్ల మంది ఉద్యోగులను ఇలా లోక్‌పాల్, లోకాయుక్త అనుమతి పరిధిలోకి తేవటమంటే అవినీతి నిరోధక వ్యవస్థ, చట్టాలలను స్తంభింపచేయటమే.

రాజ్యసభ కమిటీ ఈ విచారణ అనుమతి మంజూరును కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వం చేయాలని సూచిస్తోంది. రాష్ట్రాలలో చాలా కేసులలో విచారణకి అభ్యర్థనను ప్రభుత్వాలే పెండింగ్‌లో ఉంచటం వల్ల.. సాక్ష్యాధారాలు బలంగా ఉన్న కేసులలో కూడా విచారణలో జాప్యం జరుగుతోందని వెల్లడైంది. ఒకవేళ గుమాస్తా లేదా చిన్నస్థాయి ప్రభుత్వోద్యోగి విషయంలో కూడా విచారణకు ప్రభుత్వ అనుమతి కావాలంటే ఇక ఆ కేసులు తేలటంపై ఆశలు వదులుకోవాల్సిందే. ఈ మొత్తం వ్యవహారం ఏళ్లకు ఏళ్లు పట్టటం వల్ల ప్రజలకు ప్రభుత్వం మీద నమ్మకం పోయే ప్రమాదముంది. ఈరకంగా రాష్ట్ర ప్రభుత్వాలు లేదా కేంద్ర ప్రభుత్వం లేదా లోక్‌పాల్, లోకాయుక్తలు ఇవన్నీ అవినీతిని ఎదుర్కోవటంలో విఫలమయ్యే సవరణలు ఇవి. అందరు ఉద్యోగులనూ ఇందులో చేర్చడం అనేది తెలివిమాలిన చర్యేకాకుండా ప్రభుత్వం మీద కూడా అధికభారం మోపుతుంది.

అయితే ప్రభుత్వ నిర్ణయాలలో విధానపరంగా భాగస్వాములయ్యే ఉద్యోగులకు విచారణ వేధింపుల నుంచి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. అటువంటి సందర్భాలలో విధి నిర్వహణలో భాగంగా అధికారి ఆరోపణలు ఎదుర్కొంటున్నందున ముందస్తు అనుమతిని తప్పనిసరి చేస్తూ 17 ఎ (1)ని చేర్చవచ్చు.

### లంచం ఇచ్చే వారిని ప్రాసిక్యూట్ చేయటం:

రాజ్యసభ సెలెక్ట్ కమిటీ నివేదిక ప్రకారం, అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లులోని ప్రతిపాదిత సెక్షన్ 8ను

అనుసరించి లంచం ఇవ్వచూపడం నేరపూరిత చర్య, స్వతంత్ర నేరం. ప్రభుత్వాధికారులు వారి విధులు నిర్వర్తించడానికి లంచం ఇవ్వచూపడం, ఇస్తానని వాగ్దానం చేయటం లేదా ఇవ్వడాన్ని విచారణకు అర్హమైన నేరంగా పరిగణిస్తారు. లంచం ఇచ్చేవారికి రక్షణ కల్పించేందుకు సెక్షన్ 8లోని సబ్ సెక్షన్‌ని ప్రతిపాదించారు. లంచం ఇచ్చేవారు ముందుగా చట్టానికి తెలియచేయటం, దర్యాప్తు సంస్థకు ఉప్పందించటం వల్ల మాత్రమే వారికి ఈ రక్షణ లభిస్తుంది. కానీ రోజువారీ సేవల కోసం సాధారణ పౌరులు బలవంతంగా, గత్యంతరం లేక ఇచ్చే లంచాల నుంచి రక్షణను మాత్రం ఈ సవరణలు ప్రస్తావించలేదు. లంచం ఇచ్చే పౌరుడు/పౌరురాలు వారం రోజులు ముందుగనక పోలీసుకి లేదా చట్టబద్ధ సంస్థకి సమాచారం ఇస్తేనే రక్షణ కల్పించాలని కమిటీ సిఫార్సు చేయటం ఎంత అవాస్తవికంగా ఉంది! అవినీతిపూరితమైన వ్యవస్థలో పౌరులు ఇలా స్పందించగలుగుతారనుకోవటం భ్రమ మాత్రమే. భారతదేశంలోని అధికార స్వభావం, తారతమ్యాలు పౌరులను ఎప్పుడూ బలహీనమైనవారిగానే కొనసాగిస్తూ కిందిస్థాయి ఉద్యోగుల లంచాలకు బలయ్యేలా చేస్తున్నాయి. ఇలాంటి అవినీతి ఉచ్చులో చిక్కుకుని నిస్సహాయంగా ఉన్న పౌరులను నేరస్తులుగా పరిగణించటమనేది అసంబద్ధమైన, అర్థరహితమైన చర్య. ఇలాంటి చర్యలు పౌరుల్ని ప్రభుత్వానికి దూరం చేస్తాయి. అమాయక పౌరులను శిక్షించేలా, లంచగొండి అధికారులను రక్షించేలా సవరణలు ప్రతిపాదించటం అనైతికం. ప్రభుత్వ విశ్వసనీయతనే సందేహాస్పదం చేసే రకంగా ఉన్నాయివి. బలవంతపు అవినీతిని అంతం చేయటం కేవలం సమర్థ సేవల ద్వారానే సాధ్యం తప్ప బాధిత ప్రజలనే శిక్షించటం ద్వారా కాదు.

అయితే, లంచం ఇచ్చే వారిలో ఇంకొక తరగతి కూడా ఉన్నారు. వారి వల్ల ప్రజాశ్రేయస్సు దెబ్బతినటమేకాకుండా అవినీతితో ప్రభుత్వోద్యోగులు కూడా ఆర్జిస్తుంటారు. ఒప్పందాలు, సహజ వనరుల కేటాయింపు, లైసెన్సులు, నియామకాలు, అధికారుల బదిలీల మంజూరు, సాక్ష్యాల్ని సమకూర్చటం, ప్రాసిక్యూషన్‌ను అనుచితంగా ప్రభావితం చేయటం, చట్టాన్ని అతిక్రమించటం, ఖజానాని దోచుకోవటం, అధర్మ పోటీ, ప్రజలకు అందాల్సిన సేవల నాణ్యతను దెబ్బతీయటం, సాధారణ పాలన గాడితప్పేలా చేయటం వంటి వాటికోసం లంచాలిచ్చేవారుంటారు. ఇలాంటి లాలూచీ లంచాలిచ్చేవారిని మాత్రం కఠినంగా శిక్షించటం అవసరం.

ఇప్పుడున్న చట్టాలు మాత్రం ఇందుకు అనుగుణంగా లేకపోగా విరుద్ధంగా ఉన్నాయి, తయారవుతున్నాయి. రెండవ పరిపాలనా సంఘం సిఫార్సుల ప్రకారం, లాలూచీ అవినీతి కేసులలో శిక్షల్ని పెంచాలి, ప్రాథమిక సాక్ష్యాధారాలుంటే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యతను నిందితునిమీదే ఉంచాలి.

కాబట్టి.. లాలూచీ అవినీతికి, గతిలేక బలవంతంగా ఇచ్చే లంచాలకు మధ్య స్పష్టమైన గీత గీయాల్సుంది. ఈ రెంటినీ వేరుచేస్తూ నిర్వచనాన్ని చట్టంలో పొందుపరచాల్సి ఉంది. ఇందుకు కొన్ని ప్రమాణాలు:

- లంచం ఇచ్చేవాడికి ఏదైనా అనుచితమైన, అనర్హమైన లబ్ధి చేకూరుతోందా?
- ఏదయినా మోసం, మాయ లేదా పోటీని దెబ్బతీసే ప్రయత్నముందా?
- ఖజానాకు నష్టం జరుగుతోందా?
- అనర్హులకు లాభం కలిగేలా నిర్ణయం తీసుకోవటంపై లంచం ప్రభావం ఉందా?
- అవినీతి వల్ల ప్రజలకు అందాల్సిన సేవలు, వస్తువులలో నాణ్యత దెబ్బతిందా?
- భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించటం ద్వారా ప్రజాప్రయోజనాలకు, పర్యావరణానికి హాని జరిగిందా?

పైన పేర్కొన్న అంశాలలో ఏ ఒక్కదానికి సమాధానమైనా అనుకూలంగా వస్తే అటువంటి కేసును లాలూచీ అవినీతి కేసుగా పరిగణించాలి. అందువల్ల అవినీతి నిరోధక చట్టసవరణ బిల్లులోని సెక్షన్ 7లో లాలూచీ అవినీతిని నిర్వచించాల్సి ఉంది. ఖజానా, ప్రజాప్రయోజనాలు దెబ్బతింటున్న అవినీతి కేసులన్నీ లాలూచీ కేసులే. ఇలాంటి కేసులలో, ఇంతకుముందే చెప్పుకున్నట్టు శిక్షలు మరింత ఎక్కువగా ఉండాలి. ప్రజాప్రయోజనాలను దెబ్బతీసేలా వ్యవహరించిన ప్రభుత్వాధికారిని, అందుకు లంచం ఇచ్చినవారితో సహా అవినీతి కేసులో విచారణ చేయవచ్చు. కానీ గతిలేక లంచాలిచ్చేవారికి మాత్రం పూర్తి రక్షణ కల్పించాలి.


బలవంతంగా గతిలేక లంచాలిచ్చే సమస్యకు పరిష్కారం శిక్షలలో కాకుండా సమర్థమైన ప్రభుత్వ సేవలలోనే ఉంటుంది. ప్రజలకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన సేవల్ని అందించటం, ఆలస్యమైతే పరిహారం చెల్లించటం కోసం 'పౌరసేవల' (సర్వీస్ గ్యారంటీ) చట్టాన్ని అమలుచేయాలి. అధ్వాన్న వ్యవస్థ వల్ల లంచాలిస్తున్న సామాన్య ప్రజలను నేరస్తులను చేయాలనుకోవటం విపరీత ధోరణే అవుతుంది. అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లులోని ఈ లోపాల్ని తొలగించి పౌరసేవల చట్టాన్ని తీసుకురావాలని పార్టీలకతీతంగా పార్లమెంటు సభ్యులను కోరుతున్నాం.

(పూర్తి వివరాలున్న ఈ నోట్ ఆంగ్లమూలాన్ని www.fdrindia.org లో చదవవచ్చు)

# ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుదాం



## జిల్లాల నూతన అధ్యక్షులతో లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు



తెలంగాణలో కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర శాఖ కొన్ని మార్పుల్ని, కొనసాగింపుల్ని, కొన్ని జిల్లాలకు నూతనంగా అధ్యక్షుల నియామకాన్ని ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర సమితి కేంద్రీకృత, పాత రాజకీయ పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారని, జనం చేతికి అధికారమిచ్చే కొత్త రాజకీయంతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా సారథులకు లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని చేరుకున్నాక సంస్థాగత ఎన్నికల్ని నిర్వహించు కుందామన్నారు.

## జీహెచ్ఎంసీ, జిల్లాలవారీగా లోక్‌సత్తా పార్టీ నూతన అధ్యక్షులు :

| | | |
|---|---|---|
| నిజామాబాద్ | – | దొడ్ల శేఖర్ |
| కామారెడ్డి | – | ఎం.డి తాహెర్ |
| వనపర్తి | – | రామచంద్రుడు |
| వరంగల్ | – | జగదీశ్వరరావు |
| నల్గొండ | – | వీరప్రతాపరావు |
| కరీంనగర్ | – | వంశీకృష్ణ |
| మేడ్చల్ | – | నవీన్ కుమార్ |
| సూర్యాపేట | – | నాగరాజు |
| జగిత్యాల | – | సుగుణాకర్ |
| పెద్దపల్లి | – | సతీష్ కుమార్ |
| సంగారెడ్డి | – | నిజాముద్దీన్ |
| సిద్దిపేట | – | రాజు |
| ఖమ్మం | – | బాలాస్వామి |
| భద్రాద్రి (కొత్తగూడెం) | – | రాములు |
| గద్వాల్ (జోగులాంబ) | – | వీరేష్ |
| నాగర్ కర్నూల్ | – | నరేష్ |
| మంచిర్యాల | – | రామ్మోహన్ |
| యాదాద్రి | – | మల్లేశం |
| మెదక్ | – | గోపాల్ |
| గ్రేటర్ హైదరాబాద్ | – | రాము దోసపాటి |

కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బి. దుర్గారావు, ఎన్. సరోజాదేవి, జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నిఖిల్. ఎ, యువసత్తా, విద్యార్థి సత్తా రాష్ట్ర అధ్యక్షులు శివరామకృష్ణ, రాజీవ్ పాల్గొన్నారు.

# జన్మభూమిలో నిలదీయండి




జనవరిలో జరిగే జన్మభూమి కార్యక్రమంలో నియోజకవర్గాలవారీగా స్థానిక సమస్యలపైన, పంచాయతీల అధికారాలను కబ్జా చేస్తున్న చంద్రబాబు పార్టీ కమిటీలపైన ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని నిలదీయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పిలుపునిచ్చింది. దీనికి సంబంధించి జనచైతన్య కార్యక్రమాలను చేపట్టాలని పార్టీ నేతలకు సూచించింది.

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో విజయవాడలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.


రాష్ట్రంలో ప్రజాసమస్యలు పేరుకుపోతుంటే అధికారులు ప్రజలకు అందుబాటులో లేకుండా ముఖ్యమంత్రి వీడియో, టెలీ కాన్ఫరెన్సుల కోసం కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, కొందరు అమరావతి-హైదరాబాద్ మధ్య షటిల్ సర్వీసుకే సమయం వెచ్చిస్తున్నారని రాష్ట్ర కమిటీ ఆరోపించింది. అంతా తాత్కాలిక తాయిలాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్లు, అమరావతి సెట్టింగులు తప్ప ప్రజల జీవితాన్ని బాగు చేసే నాణ్యమైన విద్య, వైద్యం, సహకార పరపతి వ్యవస్థను పటిష్టం చేయటం వంటి చర్యలేవీ ప్రభుత్వం ఇప్పటిదాకా చేయలేకపోయిందని పేర్కొంది. ఉత్తరాంధ్రలోని పలు సహకార చక్కెర కర్మాగారాలలో రెండు లక్షల బస్తాల పంచదార నిల్వలు ఉన్నాయని, వాటిని ఆలయాల్లో ప్రసాద అవసరాలకు ప్రభుత్వం తక్షణం కొనుగోలు చేయించాలని నేతలు అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలు అందించేందుకు 'పౌరసేవల చట్టం' తీసుకురావాలని డిమాండ్ చేశారు. సరైన ప్రత్యామ్నాయం లేక 2014 ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు ఓటు వేశారని, ప్రత్యేక హోదా, ఉద్యోగాల కల్పన వంటి కీలక హామీల అమలులో ఆయన ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని అన్నారు. జన జీవితాల్ని మెరుగుపరిచేలా పార్టీలకతీతంగా పరిష్కారాలను అందించే లోక్‌సత్తా జేపీలాంటి నాయకుడి కోసం ప్రజలు ఆలోచన చేస్తున్నారని అన్నారు.

# చక్కెర కర్మాగారాలలో ఇథనాల్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలి

ఇథనాల్ ప్లాంట్‌లు వంటివి అదనంగా ఏర్పాటు చేసి లాభాలబాట పట్టించే ప్రయత్నం చేయకుండా.. రాష్ట్రంలో చక్కెర కర్మాగారాలను పూర్తిగా మూసివేయటమే లక్ష్యమన్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్నారని బాబ్జీ ధ్వజమెత్తారు. చక్కెర కర్మాగారాల సమస్యలకు నిర్దిష్ట పరిష్కారాలను కోరుతూ విజయనగరం జిల్లాలోని భీమసింగి కర్మాగారంలో చక్కెర శాఖ కమిషనర్‌ని కలిసి ఆయన వినతిపత్రం అందించారు. అనంతరం బాబ్జీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సొంత జిల్లా చిత్తూరులో రేణిగుంట, చిత్తూరులో కర్మాగారాల్ని మూసివేశారన్నారు.

రాష్ట్రంలో మొత్తం 19 కర్మాగారాలు ఉండగా, ప్రస్తుతం నాలుగు మాత్రమే సీజన్‌లో నడుస్తున్నాయన్నారు. వీటి బాగోగులు చూసేందుకు వేరే మంత్రిని ఏర్పాటు చేయకుండా చంద్రబాబు నాయుడు తన వద్దే ఆ శాఖను అట్టిపెట్టుకున్నారన్నారు. కనీసం సమీక్ష కూడా చేయటం లేదన్నారు. మార్కెట్‌లో పంచదారకు డిమాండ్ పెరుగుతున్నా రైతులకు నష్టాలే మిగులుతున్నాయన్నారు. రానున్న కాలంలో బెల్లంకి డిమాండ్ పెరిగితే కర్మాగారాలకు చెరకు కూడా తగినంత సరఫరా అవదని, దీనివల్ల అనేకమంది కార్మికులు కూడా వీధినపడే ప్రమాదముందన్నారు. రాష్ట్రంలో నడుస్తున్న కర్మాగారాలకు ప్రభుత్వం చేయూత అందించకపోతే సంక్షోభం ముదిరే అవకాశముందన్నారు. ఫ్యాక్టరీలలో అదనంగా కో జనరేషన్, ఇథనాల్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. భీమసింగి కర్మాగారంలో కార్మికులు ఏళ్ల తరబడి దినసరి వేతనాలపై పనిచేస్తున్నారని, వీరిని సీనియారిటీ ప్రాతిపదికన రెగ్యులరైజ్ చేయాలని బాబ్జీ కోరారు.

# సారీ జస్టిస్ చౌదరిగారూ..
# మీ తీర్పుని మా 'కామన్‌సెన్స్' ఒప్పుకోవటం లేదు!



రాజకీయం మాతృ రంగంలాంటిది. అన్ని రంగాలనూ ప్రభావితం చేస్తుంది. అలాంటి రాజకీయ వ్యవస్థలో అవినీతిపరులు ఉంటే మిగతా రంగాల్లో కంటే పెనుస్థాయిలో దేశాన్ని నాశనం చేస్తారు. అందుకే అవినీతి అంతానికి, అందులోనూ ఓట్లు కొనుగోలు చేసే రాజకీయ అవినీతి అంతానికే పెద్ద నోట్ల రద్దు కార్యక్రమం చేపట్టామని మోదీ సర్కారు ఊదరగొడుతోంది. అలాంటిది కోట్లు పెట్టి ఓటు కొనేందుకు ప్రయత్నించిన ఓ సంచలన కేసులో ప్రజలందరికీ సాక్ష్యాధారాలు తేటతెల్లంగా కనిపిస్తున్నా, అది అవినీతి కాదని కోర్టులో వాదనలు సాగాయి. పక్కా సాక్ష్యాలున్నా చట్టంలో, ప్రాసిక్యూషన్‌లో లసుగులు, బలహీనతలవల్లో, మరోకారణంవల్లో జస్టిస్ చౌదరిగారు ప్రధాన నిందితుడు నిర్దోషి అనే తీర్పు చెప్పారు.

చట్టానికి న్యాయానికి జరిగిన ఈ సమరంలో,<br>
ధర్మానికి రక్తానికి జరిగిన సంగ్రామంలో,<br>
కడుపు తీపికి కట్టుబడని తీర్పు,<br>
కన్నీటికీ కరిగిపోనిదీ తీర్పు..

అని జస్టిస్ చౌదరి సినిమాలో ఎన్టీరామారావు పాడుతున్నప్పుడు ఒడలు పులకరించి ఉప్పొంగని వారుండరు. ఆ సినిమా పేరులో ఒక కులం పేరు ఉన్నా కూడా.. కులానికి అతీతంగా చట్టం, న్యాయం, ధర్మం మూర్తీభవించిన వ్యక్తిగా ఎన్టీఆర్‌ను ప్రజలు రిసీవ్ చేసుకున్నారు. కానీ తాజా కేసులో జస్టిస్ చౌదరిగారి తీర్పు మీద పలు హేతుబద్ధమైన సందేహాలు, అనుమానాలు ముప్పిరిగొంటున్నాయి. ఈ కేసు ఏమిటో ఇప్పటికే అర్థమై ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాన పాత్రధారిగా ఉన్న ఓటుకు కోట్లు కేసు! తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్టీఫెన్‌సన్ అనే నామినేటెడ్ ఎమ్మెల్యే ఓటు కొనుగోలుకు చంద్రబాబు పార్టీకి చెందిన రేవంత్ రెడ్డి అనే సీనియర్ నేత, ఎమ్మెల్యే రూ. 5కోట్లు దాకా ఆఫర్ చేసినట్టు అందరూ చూశారు. అందులో చంద్రబాబు వాయిస్‌ని పోలిన గొంతును కూడా అందరూ విన్నారు. లోక్‌సత్తా సహా ఎవరు ఎంత అడిగినా.. ఆ వాయిస్ తనది కాదని ఆయన ఎక్కడా చెప్పలేకపోయారు కూడా! అంత పక్కాగా ప్రాథమిక సాక్ష్యాలున్నాయి.

ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబు పాత్రపై సమగ్రంగా విచారణ జరపాలని వైకాపా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు జరపాల్సిందిగా ఏసీబీని ప్రత్యేక న్యాయస్థానం ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని చంద్రబాబు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. చంద్రబాబు వ్యాజ్యం నేపథ్యంలో ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాల అమలును నిలుపుచేస్తూ హైకోర్టు నవంబర్ 2, 2016న మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆళ్ల రామకృష్ణారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న సుప్రీంకోర్టు ఈ వ్యవహారంపై నాలుగు వారాల్లో తుది విచారణ జరపాలంటూ నవంబర్ 23న హైకోర్టును ఆదేశించింది. డిసెంబర్ 9న జస్టిస్ టి. సునీల్ చౌదరి తీర్పునిచ్చారు.

**ఓటుకు లంచమిస్తే అవినీతి చట్టం వర్తించదంటూ వాదనలు**

'ఓటు హక్కు వినియోగించుకోవడమన్నది ప్రజా విధుల్లో భాగం కాదు. ప్రజా విధుల్లో భాగం కాని నేరానికి అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్) ఎలా వర్తిస్తుంది?' అని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టులో చంద్రబాబు తరపునప్రశ్నించారు.

ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడమనేది ప్రజావిధుల్లో భాగం కాదని సుప్రీంకోర్టు సైతం గతంలోనే స్పష్టం చేసిందని లూథ్రా తెలిపారు. ఈ కేసులో అసలు ఫిర్యాదుదారుడైన నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఓటు వేసేందుకు లంచం

ఇవ్వజూపారనేది ప్రధాన ఆరోపణని తెలిపారు. ఇందుకు సంబంధించి నిందితులపై ఏసీబీ అధికారులు పీసీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారన్నారు. ప్రజావిధుల్లో భాగంకాని నేరానికి పీసీ యాక్ట్ ఎలా వర్తిస్తుందో అర్థం కావటం లేదన్నారు. ఇందుకు లూథ్రా ఓ ఉదాహరణ ఇచ్చారు. 'మునిసిపాలిటీలో ఓ ఇంజినీర్‌ని తీసుకుందాం. తాను చేయాల్సిన పనికి సంబంధించి లంచం తీసుకుంటే అది నేరం అవుతుంది. దానికి అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయవచ్చు. అదే ఇంజినీర్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు డబ్బు తీసుకుంటే దానికి అవినీతి నిరోధక చట్టం ఎలా వర్తిస్తుంది? పబ్లిక్ సర్వెంట్ హోదాలో అతను ఓటు వేయలేదు. పైపెచ్చు ఓటు హక్కు ప్రజావిధుల్లో భాగం కానే కాదు' అని లూథ్రా వివరించారు. 'ఓటుకు కోట్లు కేసులో ఏసీబీ దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. ఇప్పటికే ఏసీబీ సంబంధిత కోర్టులో ఛార్జిషీట్ కూడా దాఖలు చేసింది' అని ఆయన తెలిపారు. ఫిర్యాదుదారు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఏసీబీ ఛార్జిషీట్ దాఖలు చేసిన విషయాన్ని సంబంధిత కోర్టు దృష్టికి తీసుకురాలేదన్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిన కేసులో మళ్లీ దర్యాప్తు జరపాలని అధికారులను ఏసీబీ కోర్టు ఆదేశించిందని తెలిపారు. ఈ ఆదేశాల వల్ల ఏసీబీ అధికారులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉంటుందని, ఒకే కేసులో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం సరికాదని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టంగా పేర్కొందని ఆయన కోర్టుకు నివేదించారు.



... ముందు అలా ఒప్పించి తర్వాత ఇచ్చినందుకు కూడా తప్పుకాదని ఒప్పిస్తారనుకుంటా సార్!!

## ప్రశ్నలనే మిగిల్చిన తీర్పు

ఇక డిసెంబర్ 9, 2016న కేసుపై తీర్పునిస్తూ ఓటుకు కోట్లు కేసులో జోక్యం చేసుకునే అర్హత వైకాపా ఎమ్మెల్యేకి లేదని జస్టిస్ టి. సునీల్ చౌదరి అన్నారు. "చంద్రబాబు లంచం ఇవ్వజూపలేదు, టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటేయమని అడగలేదు, ఏసీబీని ప్రభావితం చేస్తున్నారన్నది ఊహాజనితమే" అన్నది హైకోర్టు తీర్పు స్థూలసారాంశం. కోట్లలో లంచం ఇవ్వజూపిన డబ్బు ఎక్కడ్నుంచి వచ్చింది, వెనక ఎవరున్నారు, సర్కమ్‌స్టెన్షియల్ ఎవిడెన్స్ ఏం చెబుతోంది.. వంటి వన్నీ శేష ప్రశ్నలుగానే మిగిలిపోయాయి.


చంద్రబాబు ఇప్పుడైతే వ్యక్తిగత అవినీతికి పాల్పడటం లేదని చాలామంది నమ్ముతున్నారు. కానీ దేశాన్ని నాశనం చేసేలా ఎన్నికలలో వేలకోట్ల నల్లధనాన్ని ఖర్చు చేసే విషయంలో మాత్రం గతం కంటే దిగజారుతున్నారని చాలామంది భావిస్తున్నారు. ఓటుకు కోట్లు కేసు అందుకు పక్కా భారీ సాక్ష్యం. ఓటుకు కోట్లు కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటూ, డీమానిటైజేషన్ తన వల్లే జరిగిందంటున్న (తర్వాత చెప్పుకోలేని కొన్ని కారణాల వల్ల పిల్లిమొగ్గలు వేశారనుకోండి) చంద్రబాబు నాయుడు సహా ఈదేశంలోని రాజకీయ నాయకులు, చట్టసభలు, న్యాయవ్యవస్థ, మీడియా, ప్రజలూ ఆత్మపరిశీలన చేసుకుని సంస్కరణల దిశగా వేసుకోవాల్సిన ఇంకొన్ని ప్రశ్నలూ ఈ కేసు వాదనలు, తీర్పులో ఉన్నాయి..

- నేరస్తులెవరో ఇంగితజ్ఞానం (కామన్‌సెన్స్)కి కూడా స్పష్టంగా అర్థమవుతున్న కేసులలో కోర్టులు దోషులను విడిచిపెట్టటాన్ని ఒక రాజ్యాంగ ప్రజాస్వామిక వ్యవస్థలో సహించగలమా? అలాంటి న్యాయవ్యవస్థను సంస్కరించటం మీద యుద్ధప్రాతిపదికన దృష్టి పెట్టాల్సిన అవసరం లేదా?
- న్యాయవ్యవస్థను బలహీనపరుస్తూ నేరస్తులు తప్పించుకునేలా చేస్తున్న ఏసీబీ, సీబీఐలకు జవాబుదారీతనమున్న స్వతంత్ర ప్రతిపత్తిని ఎందుకు కల్పించటం లేదు?
- చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, ఇంకొంతమంది (కనీసం ఇంగితమున్న ప్రజల దృష్టిలోనైనా) కేవలం దొరికిన దొంగలు. మిగిలినవారి పరిస్థితి ఏమిటి? కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సహా పలు పార్టీలు ఇలా ఏ అధికారంలేని ఎమ్మెల్సీ పదవుల కోసం ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం లేదా? పార్టీల ఫిరాయింపుల్లో చాలామేర ఎమ్మెల్యేల కొనుగోళ్లే కాదా?
- ఓటు కొనుగోలు అవినీతి కాదంటే, ఇక ఈ దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎందుకు?
- నోట్ల కోసం ఓట్లు అమ్ముకునే, కొనే రాజకీయాన్ని మార్చి సమర్థులు, నిజాయతీపరులు డబ్బుతో ప్రమేయంలేకుండా ఎన్నికల్లో గెలిచేలా చేసేందుకు దామాషా ఎన్నికల వ్యవస్థ, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి సంస్కరణల్ని తీసుకురాకపోతే పెద్దనోట్ల రద్దు వల్ల ఒరిగేదేమిటి?

# కీలకమైన తీర్పు

- కె.రామచంద్రమూర్తి

ప్రజల జీవితాలను శాసించే అంశాలలో కొన్ని సామాజికమైనవి. మరికొన్ని రాజకీయమైనవి. ఇంకా కొన్ని ఆర్థికమైనవి. మిగిలినవి న్యాయపరమైనవి. ఈ నాలుగు రంగాలనూ సంవిధానం (రాజ్యాంగం) శాసిస్తుంది. మొదటి రెండు రంగాలపై సమాజంలో చాలాకాలంగా చర్చ జరుగుతోంది. ప్రజలు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆర్థిక, న్యాయపరమైన అంశాలపైన ఇటీవలి వరకూ అవగాహన అంతగా లేదు. సమాలోచన లేనే లేదు. పెద్ద నోట్ల రద్దు నిర్ణయం ధర్మమా అని ఇప్పుడు ఆర్థికాంశాలను అనివార్యంగా తెలుసుకోవలసి వస్తున్నది. గృహిణులూ, రైతులూ, కార్మికులూ అందరూ డిజిటల్ లావాదేవీల గురించి మాట్లాడుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించి డెబిట్ కార్డులూ, ఆన్‌లైన్ బదలాయింపులూ వగైరా ఆధునిక ప్రక్రియలలో ప్రజలందరికీ తర్ఫీదు ఇవ్వడానికి నడుం బిగించడంతో ఆర్థికాంశాలను తెలుసుకోవడం తప్పనిసరి. అంతే



ముఖ్యమైన న్యాయవ్యవస్థపైన ప్రజల పరిజ్ఞానం దాదాపు శూన్యం. ఎవరైనా తప్పని పరిస్థితుల్లోనే కోర్టు గడప తొక్కుతారు. న్యాయవాది చెప్పినట్టే నడుచుకుంటారు. తరాలు గడిచినా వ్యాజ్యాలు పరిష్కారం కావు. చట్టాలు తెలుసుకొని నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేదు. లోక్ అదాలత్ వంటి సంస్థలు సరిపోవు. అందుకే న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను ప్రశ్నించకుండా ఆమోదించడం పౌరులకు అలవాటుగా మారింది. న్యాయస్థానాలను ప్రశ్నించకూడదనీ, తీర్పులను శిరసావహించడమే కానీ విమర్శించడం నేరమనే అభిప్రాయం సామాన్య ప్రజలలో ఉంది. న్యాయమూర్తికి దురుద్దేశాలు ఆపాదించకుండా తీర్పులోని మంచిచెడులను పరిశీలించవచ్చు. ప్రజలు తమ వాదనలనూ, తీర్పులనూ తరచి పరీక్షిస్తారనే స్పృహ ఉన్నప్పుడు న్యాయవాదులూ, న్యాయమూర్తులూ, న్యాయాధికారులూ మరింత జాగ్రత్తగా ఉంటారు. వారూ మానవమాత్రులే. దైవాంశసంభూతులు కారు.

### సంవిధానమే సర్వోన్నతం

రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలనీ, సంవిధానం అన్నిటి కంటే ఉన్నతమైనదనీ, చట్టం ఎదుట అందరూ సమానమేననే అభిప్రాయంతో ప్రజలు న్యాయస్థానాలను విశ్వసిస్తారు. తాము కళ్లతో చూసిన విషయం, చెవులతో విన్న అంశం కోర్టులలో నిగ్గుతేలకుండా తేలిపోతుంటే పౌరులు గందరగోళంలో పడతారు. ఇటువంటి అనుభవం తరచుగా ఎదురైతే న్యాయవ్యవస్థపైనే అవిశ్వాసం కలుగుతుంది. కేసు వాదించే న్యాయవాది లోపమో లేక చట్టాన్ని అన్వయించడంలో న్యాయమూర్తి వైఫల్యమో తెలియదు. సాక్ష్యాధారాలు సేకరించడంలో పోలీసు యంత్రాంగం లోపం కావచ్చు. వాటిని సవ్యంగా సమర్పించడంలో ప్రాసిక్యూషన్ అసమర్థత కావచ్చు. అందుకే హత్య కేసులనూ, దొమ్మీ కేసులనూ సాక్ష్యాధారాలు లేవనే కారణంగా నేరస్తులను నిర్ణయించకుండానే, శిక్ష విధించకుండానే న్యాయస్థానాలు కొట్టివేస్తుంటాయి. 'ఓటుకు నోటు కేసు' విషయంలో ఇటువంటి పరిణామాలు చాలా సంభవిస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన నామినేటెడ్ ఎంఎల్ఏ ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు తెలంగాణ తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడు రేవంత్‌రెడ్డి నోట్ల కట్టలు ఇవ్వజూపడాన్ని టీవీలలో ప్రేక్షకులు ఒకటికి పదిసార్లు తిలకించారు. రేవంత్‌రెడ్డిని వలవేసి తెలంగాణ ఏసీబీ 2015 మే 31న పట్టుకుంది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి స్వరాన్ని పోలిన స్వరం 'మావాళ్లు బ్రీఫ్డ్ మీ..' అంటూ మాట్లాడటం టీవీ ఛానళ్లే వినిపించాయి. అనంతరం 'చంద్రబాబూ.. నిన్ను ఆ బ్రహ్మదేవుడు కూడా రక్షించలేడు' అంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) బహిరంగసభలో హూంకరిస్తూ తర్జని ఊపుతూ హెచ్చరించడం ప్రజలు టీవీలలోనే చూశారు. 'యూ హావ్ పోలీస్... వియ్ హావ్ పోలీస్. యూ హావ్ ఏసీబీ... వియ్ హావ్ ఏసీబీ...' అంటూ చంద్రబాబు నాయుడు తీవ్రస్వరంతో కేసీఆర్‌ను సవాలు చేయడం విన్నారు. ఇంత జరిగిన తర్వాత ఆరోపణలపై సత్వరం విచారణ జరుగుతుందనీ, నిజం నిగ్గు తేలుతుందనీ, ఎన్నికలలో అవినీతికి పాల్పడుతున్నవారిని న్యాయస్థానం అభిశంసిస్తుందనీ, కనీసం ఆక్షేపిస్తుందనీ



ఆశించినవారికి ఆశాభంగం మిగిలింది. డిసెంబర్ 9, 2016న హైకోర్టు న్యాయమూర్తి తాళ్లూరి సునీల్ చౌదరి ఇచ్చిన తీర్పుతో 'ఓటుకు నోటు కేసు' మరింత బలహీనపడింది. శాసనమండలి ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి ఓటు వేయవలసిందిగా కోరుతూ తనకు ముడుపులు ఇవ్వజూపారంటూ స్టీఫెన్‌సన్ ఫిర్యాదు చేశారు. ఆయన వాంగ్మూలం తీసుకొని, ఇతరత్రా ఆధారాలు సేకరించి తెలంగాణ అవినీతి నిరోధక సంస్థ (యాంటీ కరప్షన్ బ్యూరో–ఏసీబీ) అభియోగపత్రాన్ని (ఛార్జిషీట్) తెలంగాణ ఏసీబీ కోర్టులో దాఖలు చేసింది. అందులో చంద్రబాబు నాయుడు పేరును 30 కంటే ఎక్కువ సార్లు పేర్కొన్నది. అన్ని సార్లు ప్రస్తావనకు వచ్చిన వ్యక్తిని ఏసీబీ అధికారులు గవర్నర్ అనుమతి తీసుకొని విచారిస్తారనే ఎవరైనా భావిస్తారు. కానీ ఆ పని జరగలేదు. ఎందుకు జరగలేదో ప్రజలకు తెలియదు. చంద్రబాబు నాయుడు ఉమ్మడి రాష్ట్రాన్ని వదిలి అమరావతికి తరలివెళ్లడంతో రాజకీయ సమీకరణలు మారాయి. ఇద్దరు ముఖ్యమంత్రుల మధ్య రాజీ కుదర్చడంలో బీజేపీ పెద్దల ప్రమేయం ఉందని కూడా సమాచారం ప్రచారంలో ఉంది. ప్రజలలో ఉన్న అనుమానాలు బలపడే విధంగా ఈ కేసులో తెలంగాణ ఏసీబీ దర్యాప్తు మందగించింది. చంద్రబాబు నాయుడు స్టీఫెన్‌సన్‌తో మాట్లాడినట్టు ఆరోపిస్తున్న స్వరాన్ని తెలంగాణ ఏసీబీ పరీక్షకు పంపించకుండా తాత్సారం చేసింది. ఈ దశలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసులో చంద్రబాబు నాయుడి పాత్రపై దర్యాప్తు జరపాలంటూ తెలంగాణ ఏసీబీ కోర్టు తెలంగాణ ఏసీబీని ఆదేశించింది. దీన్ని చంద్రబాబు నాయుడు హైకోర్టులో సవాలు చేశారు. తెలంగాణ ఏసీబీ కోర్టు ఆదేశంపైన హైకోర్టు 2016 సెప్టెంబర్ 2న తాత్కాలిక స్టే మంజూరు చేసింది. ఆ నిర్ణయాన్ని ఆళ్ల రామకృష్ణా రెడ్డి సుప్రీంకోర్టులో సవాలు చేశారు. వాదనలు ఆలకించిన సుప్రీం ఈ కేసును నాలుగు వారాలలో పరిష్కరించాలంటూ హైకోర్టును ఆదేశించింది. చంద్రబాబు నాయుడు తరపున ఢిల్లీ నుంచి దిగ్గజాలవంటి న్యాయవాదులు వచ్చారు. రామకృష్ణారెడ్డి తరపున సుధాకరరెడ్డి వాదించారు. నవంబర్ చివరలో వాదనలు ముగిశాయి. తీర్పు డిసెంబర్ 9న ఇచ్చారు. తీర్పు పాఠం వంద పేజీలు వచ్చింది. చంద్రబాబు నాయుడికి ఊరట లభించింది. రామకృష్ణారెడ్డి మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానంటూ ప్రకటించారు. చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి అనీ, ఆయనకి తెలంగాణ యంత్రాంగం, తెలంగాణ ఏసీబీపై ఎటువంటి నియంత్రణా ఉండదనీ న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఏసీబీని పిటిషనర్ చంద్రబాబు నాయుడు ప్రభావితం చేస్తున్నారంటూ ఆళ్ల రామకృష్ణారెడ్డి చేసిన ఆరోపణ కేవలం కాల్పనికమైనది మాత్రమేనని నిర్ధారించారు. ఎవరిపైన అయినా నిరాధారమైన, అర్థంలేని ఆరోపణలు చేయడం సులభమంటూ వ్యాఖ్యానించారు. ఓటుకు నోటు కేసులో చంద్రబాబు నాయుడు పాత్రపైన దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలంటూ తెలంగాణ ఏసీబీ కోర్టు ఏసీబీని ఆదేశించడం న్యాయబద్ధమా, కాదా అన్నదే జస్టిస్ సునీల్ చౌదరి ఎదుట ఉన్న ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పడంతో సరిపుచ్చుకోకుండా, చంద్రబాబు నాయుడు నిర్దోషి అంటూ తీర్పు ఇవ్వడం విశేషం. మొత్తం మీద జస్టిస్ సునీల్ చౌదరి తీర్పుకు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఈ తీర్పు ప్రభావం తెలంగాణ ఏసీబీలో విచారణలో ఉన్న అసలు కేసుపైన పడే అవకాశాలు ఉన్నాయి. ఏసీబీ కోర్టుకు హైకోర్టు తీర్పు మార్గదర్శనం చేస్తుంది.

న్యాయమూర్తి అన్ని కోణాల నుంచీ సాక్ష్యాధారాలను జాగ్రత్తగా పరిశీలించే సుదీర్ఘమైన తీర్పు వెలువరించి ఉంటారు. సుప్రీంకోర్టు లోగడ ఇచ్చిన తీర్పులను ఉటంకిస్తూ సాధికారికంగా తీర్పు రచించి ఉంటారు. చట్టపరమైన అంశాల జోలికి వెళ్లకుండా కేవలం ఇంగితజ్ఞానం వినియోగించి తీర్పు చదివినవారికి కొన్ని సందేహాలు కలుగుతాయి. వాటిలో ప్రధానమైనవి ఇవి. 1) రెండో ప్రతివాది రామకృష్ణారెడ్డికి తెలంగాణ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అర్హత (లోకస్‌స్టాండీ) లేదని న్యాయమూర్తి నిర్ణయించారు. 2) రెండో ప్రతివాది సమర్పించిన స్వరనమూనాను విశ్వసించడం కష్టం

అనీ, అది సేకరించిన విధం సరైనది కాదనీ, ప్రతివాది ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదు ఏసీబీ ఛార్జిషీట్‌కు నకలు మాత్రమేననీ వ్యాఖ్యానించారు. 3) కక్షిదారు (పిటిషనర్) చంద్రబాబు నాయుడూ, స్టీఫెన్‌సన్ మధ్య జరిగినట్టు చెబుతున్న సంభాషణను సమగ్రంగా పరిశీలించాలి కానీ ఒకటి, రెండు వాక్యాలను చూపించి భాష్యం చెప్పకూడదని అన్నారు. తమ పార్టీకి ఓటు వేయమని కానీ ఓటింగ్ రోజున నగరంలో ఉండకుండా విదేశాలకు వెళ్లమని కానీ స్టీఫెన్‌సన్‌కు చంద్రబాబు నాయుడు చెప్పలేదని న్యాయమూర్తి తెలిపారు. 4) ఒక వ్యక్తికి తెలియకుండా అతని స్వరాన్ని రికార్డు చేసినట్టయితే అది న్యాయస్థానంలో చెల్లనేరదని చెప్పారు. 5) రెండో ప్రతివాది వ్యక్తిగత, రాజకీయ కక్ష సాధింపు కోసం ఈ వ్యాజ్యం తీసుకువచ్చారని అనుకునే అవకాశం లేకపోలేదని అన్నారు. రామకృష్ణారెడ్డికి నిగూఢమైన లక్ష్యం (హిడెన్ ఎజెండా) ఉన్నదని ఆరోపించారు. ప్రజాప్రయోజన వ్యాజ్యం పేరుతో వ్యక్తిగత ప్రయోజనాల కోసం న్యాయస్థానాలను వినియోగించుకునేవారిని ఉపేక్షించరాదంటూ ఉద్ఘాటించారు. 6) ఏసీబీ ప్రత్యేక కోర్టు మెదడు ఉపయోగించకుండా ఆదేశాలు జారీ చేసిందంటూ తప్పుపట్టారు. ఈ ఆరు అంశాలలో ఏమైనా వైరుధ్యాలు ఉన్నాయేమో పరిశీలిద్దాం.

**రాజ్యానిదే బాధ్యత**

నేరం ఎవరు చేసినా, ఎక్కడ జరిగినా దాన్ని విచారించి దోషులను శిక్షించే బాధ్యత, హక్కు పూర్వకాలంలో రాజులకు ఉండేది. రాజ్యాంగ పాలన అమలులోకి వచ్చిన తర్వాత ఈ తరహా రాజ్యాంగ విధులు నిర్వహించడానికి న్యాయవ్యవస్థ ఏర్పడింది. నేరం జరిగినప్పుడు దాని తాలూకు సమాచారం ఎవరు న్యాయస్థానానికి అందించారన్నది ప్రశ్న కాదు. సమాచారం సరైనదా కాదా అన్నదే పరిశీలనాంశం. ఫిర్యాదు చేసినవారు ఎక్కడివారైనా, ఎవరైనా కావచ్చు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుడికి తెలంగాణ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేసే హక్కు లేదనడం చట్ట ప్రకారం సహేతుకమేమో కానీ చట్టం తెలియని సాధారణ పౌరులకు సమంజసంగా కనిపించదు. బాధితులు మినహా తక్కినవారికి అర్హతే లేదంటే న్యాయం నిర్ణయించే క్రమానికి అది పరిమితి అవుతుంది. టూ జీ స్కాం వంటి నేరాలు ప్రజాప్రయోజనవ్యాజ్యం (పీఐఎల్) ద్వారా వెలుగులోకి వచ్చినవే. కేవలం ఉత్తరం రాస్తే దాన్ని పిల్‌గా స్వీకరించిన జస్టిస్ భగవతి వంటి గొప్ప న్యాయమూర్తుల గురించి గర్వంగా చెప్పుకుంటాం. క్రిమినల్ కేసుకూ, ప్రజాప్రయోజనాల వ్యాజ్యానికీ అంతరం ఉన్నది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారమే వ్యవహరించాలన్న మాట వాస్తవమే. కానీ సంబంధం లేనివారు ఫిర్యాదు చేయకూడదన్నా, పిటిషన్ దాఖలు చేయరాదన్నా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడూ, దాడులు జరిగినప్పుడూ పోలీసులకు సమాచారం అందించడానికి ఎవరూ ముందుకు రారు. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని గురజాడ చెప్పింది రాజ్యానికీ వర్తిస్తుంది. రాజ్యం (స్టేట్) అంటే పౌరులే. పౌరులు తమ సౌలభ్యం కోసం సృష్టించుకున్న రాజ్యాంగ వ్యవస్థల సమాహారమే. ప్రతి పౌరునికీ ఏ కోర్టులోనైనా పిటిషన్ వేసే స్వేచ్ఛ రాజ్యాంగం ప్రసాదించిందనే భావన అందరిలో ఉంది.

**స్వరనమూనాపై విశ్లేషణ**

కోర్టుకు దరఖాస్తు పెట్టుకొని కోర్టు అనుమతితో స్వరనమూనాను తీసుకోవాలన్న మాట నిజమే. రెండో ప్రతివాది ఏదో ఒక విధంగా స్వరనమూనా సంపాదించి ముంబయిలోని ల్యాబ్‌లో పరీక్షించడం న్యాయస్థానానికి సాంకేతికంగా ఆమోదయోగ్యం కాకపోవచ్చు. కానీ తన ఎదుట దాఖలైన స్వరనమూనాను న్యాయస్థానంలో ఉన్న నమూనాతో పోల్చి ప్రతివాది దాఖలు చేసింది దొంగ నమూనా అని నిరూపించవచ్చు. అదే జరిగితే న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించినందుకు చట్టప్రకారం ప్రతివాదిని శిక్షించవచ్చు. రెండు నమూనాలూ ఒకటే అయితే దాన్ని ఆమోదించవచ్చు. ఎన్ని నిబంధనలు పెట్టుకున్నా అంతిమంగా నిజాన్ని నిగ్గుతేల్చడమే కదా న్యాయస్థానాల కర్తవ్యం? స్వరనమూనాకు విలువ లేదంటూనే అందులోని అంశాలపై న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. చంద్రబాబు నాయుడివిగా చెబుతున్న మాటలన్నీ సమ్యక్ దృష్టితో చూడాలని చెబుతూ 'ఫ్రీలీ యుకెన్ డిసైడ్' అని చెప్పారు కదా ఎక్కడా ఒత్తిడి చేయలేదు కదా అంటూ న్యాయమూర్తి తర్కించారు (తీర్పు పూర్తి పాఠంలో 153 నుంచి 157వ పేరా వరకూ). వారి తర్కం ప్రకారమే ఆ సంభాషణను మొత్తం స్వీకరించాలి లేదా మొత్తం తిరస్కరించాలి. ఒక వ్యక్తికి తెలియకుండా, ఆ వ్యక్తి అనుమతి లేకుండా ఎలక్ట్రానిక్ పరికరంపైన రికార్డు చేసిన స్వరం చట్టం దృష్టిలో ఆమోదయోగ్యం కాదు (Recording voice of an individual on electronic record without his knowledge or consent cannot be treated as his admitted voice) అని తీర్పు 142వ పేరాలో (86వ పేజీ ఎగువ వాక్యాలు) స్పష్టం చేశారు. ఇదే సూత్రం సర్వత్రా అమలు జరిగితే రహస్యంగా రికార్డు చేసే స్వరాలకూ, స్టింగ్ ఆపరేషన్లకూ, తెహల్కా కథనాలకూ చట్టబద్ధత లేనట్టే భావించాలి. నీరా రాడియా టేపులకూ విలువ లేదనుకోవాలి. ఇవన్నీ న్యాయమూర్తి చెప్పినట్టు అవినీతి నిరోధక చట్టంలోని 12వ సెక్షన్, భారత శిక్షాస్మృతి 120-బి సెక్షన్ ప్రకారం చెల్లవు.

న్యాయమూర్తులు తమ ఎదుట సమర్పించిన

సాక్ష్యాధారాలను పరిశీలించి నిర్ణయాలకు వస్తారు. కక్షిదారుల రాజకీయ విశ్వాసాలనూ, దేశంలో, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులనూ పరిగణలోకి సాధారణంగా తీసుకోరు. ప్రతి కేసు వెనకా ఏదో ఒక ప్రయోజనమో, ఆక్రోశమో, ఆందోళనో ఉంటుంది. వాటితో నిమిత్తం లేకుండా తన ఎదుట వినిపించిన వాదనలు ఆలకించి వస్తునిష్ఠంగా న్యాయాన్యాయాలను నిర్ణయిస్తారని న్యాయస్థానాలతో పరిచయం లేనివారు భావిస్తారు. జస్టిస్ సునీల్ చౌదరి రాజకీయ నేపథ్యాలను చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, పిటిషనర్ తెలుగుదేశం నాయకుడనీ, ప్రతివాది ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీకి చెందిన శాసనసభ్యుడనీ, పిటిషనర్‌పై వ్యక్తిగత, రాజకీయ కక్ష సాధించడం కోసం ఏసీబీ కోర్టులో పిటిషన్ వేసి ఉండవచ్చుననీ వ్యాఖ్యానించారు (130, 131వ పేరా). రామకృష్ణారెడ్డి తెలంగాణ శాసనమండలి సభ్యుడు కాదనీ, తెలంగాణలో జరిగిన నేరంతో ఆయనకు సంబంధం ఏమిటనీ ప్రశ్నించారు. ప్రజాప్రయోజన వ్యాజ్యం ముసుగులో ఎవరైనా రహస్య ఎజెండా పెట్టుకుని వ్యాజ్యం తీసుకొని వస్తే న్యాయస్థానాలు దాన్ని అనుమతించరాదని కూడా న్యాయమూర్తి స్పష్టం చేశారు. కక్షిదారుల రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవహారాలతో నిమిత్తం లేకుండా విషయ ప్రాధాన్యం, నిజానిజాల ఆధారంగా న్యాయస్థానాలు తీర్పు ఇవ్వాలన్న అభిప్రాయానికి ఇది విరుద్ధం. అయినప్పటికీ చట్టం ప్రకారం న్యాయమూర్తి నిర్ణయం సరైనదే కావచ్చు.

**పరిశోధన ఏసీబీ చేయవలసిందే**

ఏసీబీ విచారణ సవ్యంగా జరగడం లేదని భావించి, సజావుగా జరిగే విధంగా ఏసీబీని ఆదేశించాలంటూ అభ్యర్థిస్తూనే రెండో ప్రతివాది ఏసీబీ కోర్టును ఆశ్రయించారు. తాను స్వయంగా పరిశోధన చేస్తానంటూ రాలేదు. ఒక వ్యక్తికి అది సాధ్యం కూడా కాదు. కేసు పరిశోధన బాధ్యతను తాను స్వీకరిస్తానంటూ రెండో ప్రతివాది – రామకృష్ణారెడ్డి – ముందుకు వచ్చారని న్యాయమూర్తి అన్నారు (This clearly indicates that the second respondent came forward to shoulder the responsibility of investigation-para 127).పరిశోధనలో పాల్గొనడానికి ప్రతివాదిని అనుమతిస్తే ఏసీబీ నైతికంగా దెబ్బతింటుందని వ్యాఖ్యానించారు. ప్రతివాది ప్రతిపాదన అది కాదు. న్యాయమూర్తి స్పష్టంచేసినట్టే అన్ని అంశాలూ సమ్యక్ దృష్టితో చూసినప్పుడు రేవంత్‌రెడ్డికి అంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో, స్టీఫెన్‌సన్‌కు డబ్బు ఇచ్చి ఆయనను లోబరుచుకోవలసిన అవసరం రేవంత్‌రెడ్డికి ఎందుకు కలిగిందో, స్టీఫెన్‌సన్‌కి డబ్బు అప్పజెప్పడం వల్ల, ఆయనను సుముఖుడిని చేసుకోవడం వల్ల ప్రయోజనం ఎవరికో ఆలోచించాలి. ఇది చంద్రబాబునాయుడి నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ రచించిన వ్యూహమనీ, దీని అమలు బాధ్యత టీడీపీ శాసనసభ్యుడు రేవంత్‌రెడ్డికి అప్పగించారనీ, స్టీఫెన్‌సన్‌ను 'కొనుగోలు' చేసే ప్రయత్నం తెలుసుకొని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏసీబీ వలలో రేవంత్‌రెడ్డి చిక్కే విధంగా వ్యవహరించారనీ చట్టం తెలియని సాధారణ పౌరులకు అర్థం అవుతుంది. టీవీలో దృశ్యాలను చూసినవారందరికీ ఇది తేటతెల్లమే. ఈ విషయాలు న్యాయస్థానాలలో ఎప్పటికీ నిర్ధారణ కాకపోవచ్చు. అది వేరే సంగతి. ఈ కేసులో న్యాయస్థానాలలో నిర్ణయాలు ఏమైనా జనాభిప్రాయం మాత్రం మారదు.

(సాక్షి సౌజన్యంతో)

## అందరికీ నాణ్యమైన విద్యను అందించకుండా ప్రైవేటు విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించటం దుర్మార్గం

కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా విద్యను అందిస్తానన్న ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చటంలో తొలి అడుగు కూడా వేయకుండా ప్రైవేటు యూనివర్సిటీలను అనుమతిస్తోందని లోక్‌సత్తా పార్టీ అనుబంధ విద్యార్థిసత్తా తెలంగాణ రాష్ట్ర విభాగం మండిపడింది. నాణ్యమైన పాఠశాల విద్యను అందరికీ ఉచితంగా అందించటంతోపాటు ఉన్నత చదువులకు ఎంత డబ్బు ఖర్చయినా ప్రభుత్వం భరోసా ఇచ్చినప్పుడే ఇలాంటి చర్యలు తీసుకోవాలి తప్ప తల్లిదండ్రులు పస్తులుండి, ఆస్తులు అమ్ముకుని చదివించేలా ప్రభుత్వం వ్యవహరించకూడదన్నారు. తమకు ప్రభుత్వమా, ప్రయివేటా అన్నది ముఖ్యంకాదని.. ప్రతి బిడ్డకీ నాణ్యమైన విద్య జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందాలన్నదే తమ డిమాండని అన్నారు. విద్యారంగంలో తెరాస ప్రభుత్వ దిక్కుమాలిన వ్యవహారశైలికి నిరసనగా విద్యార్థిసత్తా నాయకులు వరంగల్‌లో నల్లజెండాలతో ప్రదర్శన చేశారు. విద్యార్థిసత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట పవన్ నాయకత్వంలో జరిగిన కార్యక్రమంలో చరణ్, రాహుల్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ అవినీతిపై డ్రామాలాడితే డీమానిటైజేషన్ వృథాప్రయాసే!

మనదేశంలో నల్లధనం పోగుపడటానికి ప్రధానకారణం మన ధనరాజకీయ వ్యవస్థేనని చెప్పటానికి సందేహించనక్కర్లేదు. ఎన్నికల్లో నల్లడబ్బును ఖర్చు చేయటం కోసం నల్లడబ్బునే విరాళంగా తీసుకుంటున్న మన రాజకీయం.. అందుకోసం ప్రభుత్వ కార్యాలయాల్లో, రియల్ ఎస్టేట్ రంగంలో అవినీతి, అక్రమాలను ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వాధికారులుగానీ, బడా వ్యాపారవేత్తలుగానీ అవినీతికి పాల్పడటం వెనక రాజకీయ నేతలకు సమర్పించుకోవాల్సిన ముడుపులు పెద్ద కారణంగా ఉన్నాయి. నేతలకు ఎలాగూ ముడుపులు ఇస్తున్నారు కాబట్టి, వాళ్లూ అయినకాడికి ప్రజలను దోచేస్తున్నారు. దోపిడీ పన్నుల వ్యవస్థను కొనసాగిస్తున్నారు.. ఇలా రాజకీయాల నుంచి ఒక విషవలయంలా జరుగుతున్న అవినీతి, అప్రజాస్వామిక ధోరణులు నల్లడబ్బును పెంచి పోషిస్తున్నాయి. అందుకే లోక్‌సత్తా తొలి నుంచీ ధన రాజకీయానికి ప్రత్యామ్నాయంగా జన రాజకీయాన్ని ప్రతిష్ఠించేందుకు వీలుగా రాజకీయ పార్టీలకు నిజాయతీతో కూడిన విరాళాల కోసం 2003లో చట్టాన్ని సాధించింది. ఈ చట్టం ప్రకారం పార్టీలకు విరాళమిచ్చేవారికి నూరుశాతం పన్ను మినహాయింపు ఉంటుంది. కానీ ప్రజల ఆస్తులుగా పెరగాల్సిన పార్టీలు కొందరు వ్యక్తుల సొంత ఎస్టేట్‌లుగా మారటం, అధికారమే పరమావధిగా ఓట్ల కొనుగోలును పెద్దఎత్తున చేయటం, ప్రజలు కూడా ఓటుకు నోటు వలలో చిక్కుకుపోవటం వల్ల పార్టీలు చెక్కుల ద్వారా కాకుండా హుండీ విరాళాల పేరుతో కోట్లాది రూపాయల నల్లడబ్బును విరాళంగా తీసుకుంటున్నాయి. తమ పార్టీ బీజేపీ కూడా ఇందుకు మినహాయింపు కాదని ప్రస్తుత ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ స్వయంగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీతో పలుమార్లు ఒప్పుకున్నారు. తెహల్కా కుంభకోణం నేపథ్యంలో 2003లో లోక్‌సత్తా పార్టీల విరాళాల చట్టాన్ని తీసుకురావటానికి ఆనాడు కాంగ్రెస్ నేతలు, బీజేపీ నేతలు వాజపేయి, అద్వానీ, తెహల్కాలో చిక్కుకున్న జార్జి ఫెర్నాండెజ్ వంటివారితో పాటు అరుణ్‌జైట్లీ కూడా ఎంతో సహకరించారు. సంక్షోభం రాజకీయ అవినీతితో ముడిపడి ఉందని తెలిసినా.. ఈవేళ పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్)తోనే నల్లడబ్బు పోతుందన్న వాదనను ప్రచారం చేసేందుకు జైట్లీ ప్రయత్నిస్తుండటం విచారకరం.

మనదేశంలోని చాలా ప్రాంతాలలో రాజకీయ పార్టీలు విరాళాల కోసం నల్లడబ్బును పెద్దఎత్తున తీసుకోవడానికి మూల కారణం – ఎన్నికలలో అయ్యే అసాధారణ ఖర్చు. ఐదేళ్లలో ఇలా రూ. 1,00,000కోట్లు నల్లధనం ఖర్చు చేస్తున్నారు. (ఈరకంగా గెలిచి పదవిలోకొచ్చాక రూ. 10లక్షల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారు, ప్రోత్సహిస్తున్నారు) ఈ ఖర్చు కేవలం ప్రచారానికే అయితే, సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఇతరత్రా మార్గాల్ని ఉపయోగించుకుని తగ్గించవచ్చు. ఇటీవల తెలంగాణ

## లెక్కచెప్పేదాని కంటే 20 రెట్లు ఎక్కువ ఖర్చు

పట్టణ ప్రాంత లోక్‌సభ నియోజకవర్గంలో గెలవాలంటే రూ. 10 కోట్లు, గ్రామీణ ప్రాంత నియోజకవర్గంలో గెలవాలంటే రూ. 5 కోట్లు కనీస ఖర్చు. ప్రతిష్ఠాత్మక నియోజకవర్గాలలో ఈ ఖర్చు రూ. 50, 25కోట్లకు ఎగబాకుతుంది. ఇవికాక అధిష్ఠానానికి అక్రమ చెల్లింపులుంటాయి. రాజకీయం రాష్ట్రాల్లోనే ఎక్కువ కాబట్టి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థి ఖర్చు కూడా దాదాపు లోక్‌సభ స్థానం స్థాయిలోనే ఉంటోంది. తెలుగునాట 2014 ఎన్నికల్లో అసెంబ్లీకి ఎన్నికయ్యేందుకు గరిష్ఠంగా ఖర్చు చేశారని భావిస్తున్న ఓ అభ్యర్థి రూ. 45 కోట్లు దాకా వెదజల్లినట్టు చెబుతున్నారు. కానీ లెక్కమాత్రం అందరూ రూ. 35 –40 లక్షల లోపే చూపారు. బీజేపీ దివంగత మంత్రి గోపీనాథ్ ముండే ఒక సందర్భంలో మాట్లాడుతూ, 2009 ఎన్నికల్లో తాను రూ. 8కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ డా॥ కోడెల శివప్రసాదరావు తాను ఎమ్మెల్యేగా ఎన్నికవడానికి రూ. 11.5కోట్లు ఖర్చు పెట్టినట్టు వెల్లడించారు. తర్వాత మాట మార్చారనుకోండి. నిజానికి శాసనసభ ఎన్నికల వ్యయపరిమితి రూ. 28లక్షలే. వికీలీక్స్ లెక్కప్రకారం, ఎన్నికల వ్యయానికి చట్టబద్ధంగా అనుమతించిన పరిమితి మొత్తం 2009 పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క ఎన్నికల రోజుకే సరిపోయిందని ఓ లోక్‌సభ ఎంపీ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే యూపీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రధాని పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.

## అవినీతి కేసులు పెరుగుతున్నా.. తూతూ మంత్రం శిక్షలు కూడా తక్కువే

గతంలో ఎన్నడూలేనంతగా మనదేశంలో అవినీతి కేసులు అంతకంతకూ పెరిగిపోతున్నాయని 2014లో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ పార్లమెంటుకు అందజేసిన వార్షిక నివేదికలో పేర్కొంది. 2013కంటే 82శాతం అధికంగా ఆ ఏడాది 64,410 ఫిర్యాదులు నమోదయ్యాయని తెలిపింది. పట్టుబడని, ఉన్నతస్థాయి, రాజకీయ దన్ను ఉన్న కేసుల సంగతి చెప్పనక్కర్లేదు. అయితే శిక్షలు మాత్రం అరకొరే. రెండు మూడు చిన్న రాష్ట్రాలను మినహాయిస్తే.. ప్రతి 100 అవినీతి కేసులలో ఏటా సగటున 19మందికే పడుతోంది. ఈ 19శాతానికి పడుతున్న శిక్షలు కూడా అరకొరే. అదే చైనాలో ఏటా 3,00,000 మందికి అవినీతిపరులకు శిక్ష పడుతోంది. ఆ శిక్షలు కూడా చాలా కఠినంగా ఉంటాయి. చైనా క్రమశిక్షణ పరిశీలన కమిటీ పేరు వింటేనే అక్కడి నేతలకు, ప్రభుత్వోద్యోగులకు గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటాయి. అవినీతి వల్ల ఎక్కువగా నష్టపోయేది పేదవర్గాలే. అవినీతి వల్ల చాలా పథకాల్లో ఫలాలు కేవలం 15 నుంచి 18శాతం మాత్రమే లబ్ధిదారులకు చేరుతున్నట్టు ఓ అనధికార అంచనా.

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఒక మాట చెప్పారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తాము టెక్నాలజీని ఉపయోగించి ప్రచార ఖర్చును చాలా తగ్గించామని, తాను కేవలం ఒకేఒక్క బహిరంగ సభలో మాట్లాడానని, భవిష్యత్తులో ఎన్నికల ఖర్చును ఇలా తగ్గించుకోవటం అవసరమని అన్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియాని ప్రచారానికి ఉపయోగించుకోవటంలో కొత్త పుంతలు తొక్కారు. వీరందరికంటే ముందే, 20వ శతాబ్దంలోనే లోక్‌సత్తా ఈ పరిష్కారమార్గాల్ని చెప్పింది, ఆచరించి చూపుతోంది. ప్రజల్ని డబ్బులిచ్చి పోగేయటం, రోడ్ల మీద ప్రజలకు ఇబ్బంది కలిగించటం వంటి పద్ధతుల్లో బహిరంగ సభలను నిర్వహించకుండా చిన్న చిన్న బృందాలనుద్దేశించి మాట్లాడటం, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రచారం చేయటం, పత్రికలు, టెలివిజన్ ఛానళ్లు వంటి మార్గాల్లో చర్చలతో ఆలోచింపచేయటం వంటి జన రాజకీయ పద్ధతుల్ని లోక్‌సత్తా అనుసరిస్తోంది. ఎన్నికల సమయంలో ప్రభుత్వమే టెలివిజన్ ఛానెళ్లలో అన్ని పార్టీలకూ ప్రచార సమయం కేటాయించాలన్న లోక్‌సత్తా సూచనను ఎన్నికల కమిషన్‌తోపాటు ప్రభుత్వం కూడా ఆమోదించింది కానీ ఇందుకోసం నిబంధనలను వివిధ కారణాల వల్ల రూపొందించకుండా వాయిదావేస్తూ వస్తోంది. కాబట్టి ఎన్నికల ప్రచారాన్ని ప్రక్షాళన చేసి కాలుష్యం లేకుండా నల్లడబ్బు అవసరం లేకుండా చేయటంపై అన్ని పార్టీలు, ఉద్యమాలు ముందు ఒక స్పష్టమైన అవగాహనకి రావాలి. 2014 ఎన్నికల్లో మోదీ పేదరికాన్ని పెంచే ఉచితాల హామీలివ్వకపోయినా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసినా.. ఆయనఅప్పటికే నిర్మాణమైన ఒక బలమైన సాంప్రదాయ జాతీయ పార్టీ వేదిక మీద ఉన్నారు. ఆయన పార్టీ లెక్కలు చూపని వేలకోట్లు ఖర్చు చేసిందనటంలో ఎవరికీ అనుమానం లేదు. కాబట్టి రాజకీయ పార్టీలు ఎంతో ఒడుపుగా, ప్రణాళికాబద్ధంగా ఈ సంక్షోభం నుంచి బైటపడాలి.

హుండీ విరాళాలను అడ్డుకునేందుకు వీలుగా.. పార్టీలు రూ.20వేల లోపు విరాళాలకు కూడా పూర్తి లెక్కచెప్పాలని ఎన్నికల సంఘం సహా కొందరు వాదిస్తున్నారు. పార్టీలు ఈ నగదు మినహాయింపుని దుర్వినియోగం చేశాయనటంలో సందేహం లేదు. దీన్ని సరిదిద్దాల్సిందే. కానీ ఏ రూపంలో అనేదే సవాలు. డబ్బు రూపంలో కాకుండా పూర్తిగా చెక్కు రూపంలోనే విరాళాలిస్తే, రేపు వేరే పార్టీవాళ్లు అధికారంలోకి వస్తే వేధించరని గ్యారంటీ ఏమీ లేదు (లోక్‌సత్తా పార్టీ అభిమానులు కూడా ఇలా వేధింపుల్ని ఎదుర్కొన్నారు). అలాంటి

## ప్రభుత్వాలే అవినీతిపై పోరును నీరుగారుస్తున్న దౌర్భాగ్యం

మనదేశవ్యాప్తంగా 29, 206 అవినీతి కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఉన్నతాధికారులపై వచ్చిన అవినీతి ఫిర్యాదులపై విచారణకు అనుమతి ఇచ్చే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. 2015లో రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలు 1,561 కేసులలో నిందితులపై విచారణకు అనుమతులు ఇవ్వకుండా అడ్డుపడ్డాయి. వీటిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలదే ఎక్కువ పాపం. మరోవైపు.. తనకు హక్కుగా అందాల్సిన ప్రభుత్వ సేవలకు గతిలేక లంచం ఇచ్చే పౌరులకు కనీసం మూడేళ్ల జైలుశిక్షను విధించాలని, అదే లంచం తీసుకునే ఉద్యోగి మీద కనీసం కానిస్టేబుల్ దర్యాప్తు చేయాలన్నా లోక్‌పాల్/లోకాయుక్త అనుమతి కావాలని అవినీతిపై పోరును నీరుగార్చేలా అవినీతి నిరోధక చట్టానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసింది. ఈ ప్రజావ్యతిరేక సవరణల్ని బైటపెట్టి. వీటిని వెనక్కితీసుకునేలా పార్టీలకతీతంగా లోక్‌సత్తా దేశవ్యాప్త అభిప్రాయ సమీకరణను చేస్తున్న సంగతి తెలిసిందే.

## నోట్ల రద్దుతో నల్లధనం అంతం కాదు: జేపీ



ప్రజల డబ్బుకు భరోసా ఇచ్చే బాధ్యతతో ఎన్నికైన ప్రభుత్వం.. ప్రజలకు వారి డబ్బును తిరిగి ఇవ్వటానికి వేధించటం చీటింగ్ చేయటవేనని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దేశంలో బాగా జనజీవనమున్న గ్రామాలు ఆరులక్షలకు పైగా, బ్యాంకులు కేవలం 80వేలే ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో కూడా ఏకపక్షంగా తీసుకుని, అర్థాన్నంగా అమలుచేస్తున్న కరెన్సీ రద్దు నిర్ణయాన్ని సహిద్దామనుకున్నా.. అవినీతిని అంతమొందించే మార్గాలను అన్వేషించకుండా కేవలం నోట్ల రద్దు వల్ల ప్రజలకు ఒరిగేదేమీ ఉండదని అన్నారు. మళ్లీ కొత్త నోట్లు నల్లధనంగా మారతాయన్నారు. విశాఖలో జేపీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచగొండితనం, రాజకీయ అవినీతి, రియల్ ఎస్టేట్ రంగంలో నగదు లావాదేవీలను అరికట్టకుండా దేశంలో నల్లధనం రూపుమాపటం అసాధ్యమన్నారు. జాతీయోత్పత్తిలో సుమారు 20శాతం మేర (రూ.30లక్షల కోట్ల దాకా) నల్లధనం తయారవుతోందని, అత్యధికంగా రియల్ ఎస్టేట్ చుట్టూ తిరుగుతోందని అన్నారు. లంచం ఇచ్చిన వాడికి ఏడేళ్ల దాకా శిక్ష విధించేలా చట్టం తేవడానికి ప్రయత్నిస్తున్న మోదీ ప్రభుత్వం.. లంచం తీసుకున్నవారిపై మాత్రం అనుమతి లేకుండా కనీసం కేసు పెట్టే అధికారం లేకుండా చేస్తోందని, ఇది చాలా అన్యాయమని అన్నారు.

రాజకీయ సంస్కృతి మనదేశానిది. నైతిక వాదనలతో శిక్షలు విధించాలనుకునే ముందు చాలా ఇలాంటివన్నీ సరిచేయాల్సిన గ్రౌండ్ వర్క్ చాలా చేయాల్సుంది. దేశం కోసం త్యాగం చేసే పార్టీలు, నేతలు లేరు కాబట్టి.. వాళ్లకి రాజకీయ ఉపయోగం ఉండేలాగానే ఈ పరిష్కారాలను రూపొందించాలి. రాజకీయాలు కుళ్లిపోయాయని రాజకీయ పార్టీలకు పన్ను మినహాయింపులు వద్దనటం వల్ల కాలక్షేపం అవుతుందేమోగానీ.. అంతిమంగా అది ఆత్మవంచన, మన జీవితాల్ని మనమే దెబ్బతీసుకోవటం అని అర్థం చేసుకోవాలి. మన ప్రతి అడుగునీ అవి ప్రభావితం చేస్తుంటాయని డీమానిటైజేషన్ దెబ్బకైనా గుర్తెరగాలి.

మరోవైపు, మనకున్న ప్రధాన సమస్య ఎన్నికల ప్రచారం కంటే కూడా.. ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు! 80-90శాతం నల్లడబ్బు ప్రచారంలో ఇందుకే ఖర్చవుతుంది. లోక్‌సత్తా పార్టీ కొన్ని నియోజకవర్గాలలో ప్రచారంలో తన విధానాల బలం, ఆచరణ, సాంకేతిక పరిజ్ఞానంతో సాంప్రదాయ పార్టీలతో పోటీ పడగలిగినప్పటికీ చివరిదశలో బాగా వెనకబడిపోవటానికి కారణం – ఓట్ల కొనుగోలు చేయకపోవటం. మనలో చాలామంది వ్యతిరేకించే డొనాల్డ్ ట్రంప్ లాంటి వాడు కూడా ఓట్లు కొని గెలవలేదని గుర్తించాలి. కఠిన చట్టాలు, ఇతరత్రా ఏర్పాట్లతోపాటు ఓట్ల కొనుగోలు రాజకీయం మారితేనే మనదేశంలో రాజకీయ అవినీతికి కళ్లెం పడి నల్లడబ్బుకి అసలైన చికిత్స జరుగుతుంది. అంటే ఓట్లు కొనాల్సిన అవసరం లేకుండా దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి ఏర్పాట్లతో మన ఎన్నికల వ్యవస్థని మార్చాలి. ప్రజలు రాజకీయ వ్యవస్థ మీద విశ్వాసం కోల్పోయి ఓటుకు నోటు డిమాండ్ చేయకుండా ఉండటానికి.. వారిని వ్యవస్థలో భాగస్వాముల్ని చేయాలి. పౌరసత్వం, నాయకత్వం వెల్లివిరిసేట్లు స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, నిధులను బదిలీ చేసి పన్నులకు తగ్గ సేవలందేలా చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరహాలో స్థానిక ప్రభుత్వాలతో మూడో అంచె ఫెడరలిజాన్ని బలోపేతం చేయాలి. కనీసం సమాచార హక్కు చట్టం పరిధిలోకి కూడా రామంటూ నియంతల్లా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీలను ప్రక్షాళన చేయాలి. సమర్థత గల సామాన్యులు కూడా వేగంగా పైస్థాయికి ఎదగగలిగే విధంగా ప్రజాస్వామీకరించాలి.

50 – 60 క్రితమే సంతానం కమిటీ, వాంఛూ కమిటీ అవినీతి గురించి, రాజకీయ పార్టీల నల్లడబ్బు కట్టడి గురించి చర్యలను ప్రతిపాదించినా ఇప్పటివరకూ సమగ్ర సంస్కరణల్ని అమలు చేయలేదు. ఇప్పుడు పెద్ద నోట్ల రద్దుపై కూడా తాత్కాలిక, పైపై అంశాల చుట్టూ హడావుడితో డ్రామాలు, బురదజల్లుడు, పార్టీలపరంగా లబ్ధి పొందుదామన్న దురాలోచనే తప్ప దేశ ప్రయోజనాలకగురించి దూరాలోచన కనిపించటం లేదు. ప్రాచుర్య మీడియా కూడా ఈ నాటకీయ గందరగోళంలో భాగంగా మారిపోతుండటం దురదృష్టకరం. 2003లో వచ్చిన పార్టీల నిధుల చట్టాన్ని బలోపేతం చేయటంతోపాటు.. రాజకీయ పార్టీల్ని, ఎన్నికల వ్యవస్థని ప్రక్షాళన చేసేలా పైన పేర్కొన్న సంస్కరణల్ని తేవటంపైనే డీమానిటైజేషన్ విజయం, నరేంద్ర మోదీ, బీజేపీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. దీర్ఘకాలంలో అన్ని రాజకీయ పార్టీల, దేశ భవిష్యత్తు కూడా ఈ పరిణామాల మీదే ఆధారపడి ఉంటాయి.

# వెనకబడిన జిల్లాలకు 'హోదా' ఇవ్వాలని గొంతు పెంచి అడుగుదాం: జేపీ



వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక తరగతి హోదా ఇవ్వాలని గొంతు పెంచి అడుగుదామని, ఇందుకోసం పార్టీల కతీతంగా అందరూ ముందుకు రావాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. దేశంలో ప్రత్యేక హోదా ఉన్న 11 రాష్ట్రాలకంటే కూడా ఉత్తరాంధ్ర, రాయలసీమలోని ఏడు జిల్లాల్లో వెనకబాటుతనం ఎక్కువగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర వెనకబాటుతనం, ఏపీకి 'హోదా దగా .. కింకర్తవ్యం?' అంశాలపై విశాఖపట్నంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర శాఖ నిర్వహించిన రౌండ్‌టేబుల్‌లో జేపీ ముఖ్య అతిథిగా పాన్నారు.

**లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ సారథ్యంలో జరిగిన ఈ సమావేశంలో.. పార్టీ ప్రచురించిన 'హోదా దగా .. కింకర్తవ్యం?' అనే బుక్‌లెట్‌ని తొలుత జేపీ ఆవిష్కరించారు.**



రౌండ్‌టేబుల్‌లో, ఆ తర్వాత మీడియా తోనూ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర, రాయలసీమలోని ఏడు జిల్లాలకు ప్రత్యేక హోదా రాయితీల వల్ల పరిశ్రమలు ఏర్పడి అభివృద్ధి చెందటంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశముందని జేపీ అన్నారు. దీన్ని సాధించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని అధికార, ప్రతిపక్ష నాయకులు కేంద్రాన్ని గట్టిగా నిలదీయాలన్నారు. **రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలంటే ఒడిషా, బీహార్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయని కేంద్రం చెబుతోందని, కానీ ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఉత్తర తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వెనకబడిన జిల్లాలకు హోదా ఇవ్వడం ద్వారా ఈ అభ్యంతరాలు లేకుండా వెనకబాటుతనాన్ని పారదోలవచ్చన్నారు.** కేవలం రూ.3వేల కోట్లు ఖర్చు చేస్తే ఉత్తరాంధ్ర జిల్లాల్లో అసంపూర్తిగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టును పూర్తి చేయవచ్చన్నారు. దీనికి ఎవరూ గట్టిగా ప్రయత్నం చేయటంలేదన్నారు. పోలవరం ఎడమ కాలువ నుండి ఉత్తరాంధ్ర జిల్లాలకు అవసరమైన నీటిని పూర్తిస్థాయిలో రాబట్టుకోవాలని, మహానది జలాలను గ్రావిటీతో గోదావరితో అనుసంధానం చేస్తే మంచి ప్రయోజనాలు పొందవచ్చని సూచించారు. రాష్ట్రంలో విద్య, ఆరోగ్యం రంగాల మీద ప్రత్యేక దృష్టి కావాలని, పాఠశాల విద్యకు ఏటా రూ.19వేల కోట్లు ఖర్చు పెడుతున్నా ప్రయోజనం లేకుండా ఉందని అన్నారు.

**ఏపీ, తెలంగాణకు తమిళనాడు వార్నింగ్ కావాలి**

తమిళనాడులో జయలలిత మరణం తర్వాత.. చిన్నమ్మ తప్ప దిక్కులేదనే పరిస్థితి ఏర్పడిందని, ఏకస్వామ్య పార్టీలు, కేంద్రీకృత పాలన వల్లే ప్రజాస్వామ్యం ఇలా అవహాస్యమవుతోందని జేపీ అన్నారు. తమిళ సంక్షోభం తెలుగు రాష్ట్రాలకు ఒక హెచ్చరిక కావాలని, ఇక్కడ కూడా ఏకస్వామ్య ప్రాంతీయ పార్టీలతో అధికారం, అభివృద్ధి ఒకేచోట కేంద్రీకృతమై ఉన్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు కూడా ఈ అంశాలే కారణమని గుర్తు చేశారు. ప్రజల్లో చైతన్యం రాకపోతే దేశం రాజకీయ అనిశ్చితి తప్పదన్నారు. స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేస్తేనే ప్రజాస్వామ్యానికి మనుగడ ఉంటుందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలను, నగరాలను ఒక కౌన్సిల్‌గా ఏర్పాటు చేసి స్థానిక సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని జేపీ సూచించారు.

**మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ,** ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ధైర్యంగా ముందుకొచ్చేవారు తగ్గిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాలనాపరంగా ఏ చిన్నతప్పు జరిగినా జర్నలిస్టులు, ప్రజాసంఘాలు నిలదేసేవని, ఈవేళ ఆ పరిస్థితి లేదన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై రాజకీయ నేతలు శ్రద్ధ చూపటంలేదని, ఈ పరిస్థితుల్లో వాస్తవాలు – పరిష్కారాలు చెబుతూ ప్రజల్లో చైతన్యం పెంచేందుకు జేపీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విమ్స్ ఆసుపత్రిని ప్రయివేటుకు అప్పగించే ప్రయత్నాలను విరమించుకోవాలని **సీపీఐ జిల్లా కార్యదర్శి ఏజే స్టాలిన్** డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రాన్ని మోసం చేసినవారే టీడీపీ, బీజేపీల్లో చేరి మంత్రులయ్యారని **'లీడర్' పత్రిక సంపాదకుడు రమణమూర్తి** అన్నారు. ఐదేళ్లు కాదు, పదేళ్లు హోదా కావాలన్న ముఖ్యమంత్రి.. నేడు హోదా కంటే ప్యాకేజీయే మేలంటున్నారన్నారన్నారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర నుంచి వలసలు భారీసంఖ్యలో కొనసాగుతున్నాయని, రైల్వే జోన్ వస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. సరైన నాయకత్వం లేకపోవటమే ఉత్తరాంధ్ర దౌర్భాగ్యమన్నారు. ఉత్తరాంధ్ర వెనకబాటుతనానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమని **ఉత్తరాంధ్ర రక్షణ వేదిక కన్వీనర్ ఎస్ఎస్ శివశంకర్** అన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులతోపాటు లోక్‌సత్తా పార్టీ జిల్లా కన్వీనర్ వేణుగోపాల్, స్టీరింగ్ కమిటీ సభ్యులు హరిగణేష్, దామోదర్, రాంబాబు, రాజ్ వర్మ, సాంబశివరావు, చంద్రమౌళి, ప్రజాగాయకుడు మజ్జి దేవీశ్రీ, లోక్‌సత్తా విజయనగరం ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రస్తుత ప్రభుత్వాలు రూపొందిస్తున్న విధానాల తీరుతెన్నులపై ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, తమ పూర్వ సహచరుడు, ప్రస్తుతం ఐపీఎస్ శిక్షణలో ఉన్న సోమే ముండేతో అభిప్రాయాల్ని చర్చించిన సందర్భంగా ఎఫ్‌డీఆర్ పరిశోధనా బృందం.

Posting Date 07-01-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on January 1st 2017

# నిజాలు మాట్లాడుకుందాం-11



## మన దేశంలో ఏడాదికి దాదాపు 30- 40 కోట్ల ఫోన్లను విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాము.

అలా కాకుండా మన దేశంలోనే వాటిని తయారు చేయడానికి కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, కరెంటు ఇచ్చి,నైపుణ్యాలను పెంచి, సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించినట్లైతే ఏడాదికి మన దేశంలోనే 30-40 లక్షల మందికి ఉపాధి కల్పించొచ్చు.

షేర్ చేయండి ....ప్రజలకు నిజాలు చేరవేయండి

Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B, 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad